శుక్రవారం
21-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 360
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యాపై ఈయూ కొత్త ఆంక్షలు

బ్రస్సెల్స్: రష్యాపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు కొనసాగుతున్నాయి. తాజాగా 'శక్తిమంతమైన, ప్రధానమైన' ఆంక్షలతో 14వ ప్యాకేజీకి ఈయూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు అధికారిక ప్రకటన గురువారం వెలువడింది.

ఇప్పుడున్న ఆంక్షలను మరింత తీవ్రతరం చేసేదిగా కొత్త ప్యాకేజి ఉన్నట్లు బెల్జేరియన్ ఈయూ ప్రెసిడెన్సీ ప్రకటించింది. అమల్లో ఉన్న ఆంక్షల్లో లోటుపాట్లు తొలగించి, ప్రభావాన్ని తీవ్రతరం చేస్తూ నూతన చర్యలు తీసుకున్నట్లు 'ఎక్స్' మాధ్యమంగా పేర్కొంది.

ఏమీ కొనలేం... తినలేం...

- దిగిరాని కూరగాయల ధరలు
- సామాన్యుడికి అందని నిత్యావసరాలు
- పేదోడి నరకయాతన
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కూరగాయలు కొనలేం...తినలేం...అనే రీతిలో ధరలు పెరిగిపోయాయి. నిత్యావసరాల ధరలూ పోటీ పడుతున్నాయి. పేదోడికి పట్టెడన్నం తినే పరిస్థితి కన్పించడం లేదు. గతంలో ఎన్నడూ లేనంతగా ధరలు రెట్టింపు పెరిగిపోవడంతో సామాన్యుడు ఆర్థికంగా చితికిపోతున్నాడు. విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు, గుంటూరు నుంచి అనంతపురం వరకు ధరలు విపరీతంగా మండిపోతున్నాయి. సామాన్యుడు కొనుగోలు చేయలేని పరిస్థితి తలెత్తింది. మార్కెట్లో పది రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ...ధరల నియంత్రణలో నూతన ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. మార్కెట్లో ఉన్న కూరగాయల ధరలతోపాటు రైతు బజార్లోనూ రెట్టింపుకావడంతో...సామాన్యుడి సంచి అడుగుకూ కూరగాయలు రావడంలేదు. గతం కంటే రెండు, మూడు వందల రూపాయలు జేబులో వేసుకుని రైతు బజారుకు వెళ్లినా, అధిక ధరలతో కిలోకు బదులు, పావు, అర కిలోతోనే కూరగాయలు కొనుగోలు చేసి సరిపెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ప్రధానంగా పది రోజుల నుంచి టమాటా ధరలు దిగిరావడం లేదు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యానే టమాటా ధర పెరిగిందని ప్రభుత్వ అధికారులు వివరణతోనే సరిపెట్టుకుంటున్నారేగానీ, ధరల నియంత్రణకు తగిన కార్యాచరణ చేపట్టలేదు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఈ కూరగాయల ధరల తగ్గింపు పెద్ద సవాల్‌గా మారింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, తిరుపతి, అనంతపురం ఇలా...ఏ నగరం చూసినా, పల్లె చూసినా కూరగాయలను ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇక గత్యంతరం లేక ఉద్యోగస్తుల నుంచి పేద, మధ్య తరగతి వర్గాలు సైతం కూరగాయల బడ్జెట్ తగ్గించుకుంటున్నారు. గతంలో వారానికి రెండు, మూడు కిలోల చొప్పున టమాటాను కొనుగోలు చేసే వినియోగదారుడు ఇప్పుడు ఏకంగా పావు, అర

- మిగతా 2 లో

ఏపీకి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు

సంపద సృష్టి కేంద్రాలు

- ప్రజా రాజధానిని అపహాస్యం చేసి విధ్వంసం చేశారు
- త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తాం
- తెలుగుజాతి గర్వపడేలా రాజధాని నిర్మిస్తాం
- అమరావతిలో చంద్రబాబు విస్తృత పర్యటన



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రానికి అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలని, గత పాలకుల మూర్ఖత్వం వల్ల రెండూ విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారాజధాని అమరావతిని అపహాస్యం చేసి...విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తన రెండో పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గురువారం అమరావతి రాజధానిలో దాదాపు నాలుగు గంటలపాటు విస్తృత పర్యటన చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన, విధ్వంసాలకు గురైన నిర్మాణాలు, శిథిలాలను పరిశీలించారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చిన ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాలను మొదట పరిశీలించారు. అక్కడి నుండి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా నాడు రాజధానికి భూమిపూజ జరిగిన వేదిక వద్ద మోకాళ్లపై ప్రణమిల్లారు. అక్కడ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహాలను పరిశీలించారు. తరువాత న్యాయమూర్తుల కోసం నిర్మించిన భవన సముదాయాలు, మంత్రుల నివాస గృహాలు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల, నాలుగవ తరగతి ఉద్యోగుల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్లు పరిశీలించారు. ప్రతి నిర్మాణం లోపలికి వెళ్లి ఆయా ఫ్లాట్స్ విస్తీర్ణం, ప్లాన్‌లో ఉన్న సౌకర్యాలు, డిజైన్ల గురించి అధికారులతో మాట్లాడారు. అనంతరం సీడ్ యాక్సిస్ రోడ్డులో ఉన్న సీఆర్‌డీఏ భవనం వద్ద మీడియాతో మాట్లాడారు.

ఏ అంటే అమరావతి....పీ అంటే పోలవరం

'రాజధాని కోసం భూములిచ్చిన రైతులు చేసిన సుదీర్ఘ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని చంద్రబాబు అన్నారు. రైతులు అనేక సవాళ్లను, కేసులను అధిగమించి 1,631 రోజులు ఆందోళనలు చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో ఆందోళనలు విరమించారు. రాజధాని కోసం రైతులు చేసిన పోరాటం, భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఏపీ అనే పదంలో ఏ అంటే అమరావతి...పీ అంటే పోలవరం. అమరావతి ప్రజారాజధాని. తెలుగువారికి చిరునామాగా ఉంటుంది. 5 కోట్ల మంది ప్రజలకు దశ, దిశ నిర్దేశిస్తుంది. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గర్వంగా పనులు చేసుకోవచ్చు. కానీ రాజధానిని జగన్ అతలాకుతలం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువనీళ్లు ఉండే నది గోదావరి. పోలవరం నిర్మాణం జరిగి నదులు అనుసంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లివ్వచ్చు. విభజన అనంతరం రాజధాని కట్టుకోవడానికి ఆర్థిక తోడ్పాటు, పోలవరం పూర్తి చేసుకునేందుకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, అమరావతి రాజధానికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చిందని సీఎం గుర్తు చేశారు. అర్హతలేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఎంత నష్టపోతుందో గత ఐదేళ్లలో చూశాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులు వ్యక్తిగత అంశానికి సంబంధించినవి కాదు.వ్యక్తికి, వర్గానికి, ప్రాంతానికి పరిమితమైనవి కావు. వాటి ద్వారా సంపద సృష్టి జరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పెరుగుతాయి. ప్రజల్ని సాధికారతవైపు నిలబెట్టవచ్చు. పోలవరం పూర్తి చేసి, నదుల

- మిగతా 2 లో

విద్యార్థుల భవిష్యత్ ధ్వంసం

- ప్రశ్నపత్రాల లీకేజీ దారుణం
- ఎన్‌డీఏ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఎన్‌టీఏ పనితీరుపై విపక్ష నేతల మండిపాటు

న్యూదిల్లీ: యూజీసీ–నెట్ పరీక్ష రద్దు తర్వాత నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై ప్రతిపక్ష పార్టీల నాయకులు గురువారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ పరీక్షలకు హాజరయిన విద్యార్థుల భవిష్యత్‌ను ఎన్‌టీఏతో పాటు కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని విమర్శించారు. పరీక్షలపై హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధ్వర్యంలోని భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రానికి చెందిన జాతీయ సైబర్ నేరాల ముప్పు విశ్లేషణ విభాగం నుంచి కొంత సమాచారం అందుకున్న తర్వాత బుధవారం యూజీసీ–నెట్ పరీక్షను రద్దు చేసింది. కేంద్రంలోని మోదీ సర్కార్ 'ప్రశ్నపత్రాల లీక్'ల ప్రభుత్వమని, ప్రతి సంవత్సరం ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ' పేరుతో 'గొప్ప తమాషా' నిర్వహిస్తారని, అయినప్పటికీ ఆయన ప్రభుత్వం 'లీక్‌లు... అవకతవకలు' లేకుండా ఇప్పటి వరకు ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేదని కాంగ్రెస్ విమర్శించింది. ప్రతి రోజు ప్రశ్నపత్రం లీక్ అవుతుందని, ఇది

- మిగతా 2 లో

పరీక్ష ముందు రోజే ప్రశ్న పత్రం లీక్

అంగీకరించిన నిందితులు

న్యూదిల్లీ: నీట్ పరీక్ష వివాదం కొత్త మలుపు తిరిగింది. నీట్ ప్రశ్నపత్రం పరీక్షకు ముందు రోజు లీకైందని బీహార్‌లో అరెస్టయిన నలుగురు నిందితులు అంగీకరించారు. నీట్ అభ్యర్థి అనురాగ్ యాదవ్, ధన్‌పూర్ మునిసిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజినీర్ సికందర్ యాదవేందు, మరో ఇద్దరు నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్‌లను బీహార్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పరీక్షకు ముందు రోజు తమకు ప్రశ్నపత్రం అందిందని, దానిని గుర్తు పెట్టుకున్నామని వారు

- మిగతా 2 లో

నేడు, రేపు అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఎన్డీఏ కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) అధికారంలోకి వచ్చాక తొలిసారిగా ఏపీ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.46కు శాసనసభ ప్రారంభం కానుంది. శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు ఈ సభా కార్యక్రమాలు కొనసాగుతాయి. కూటమి తరపున ఎన్నికైన టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేల ప్రమాణం, అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి ప్రమాణస్వీకారం చేయిస్తారు. సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకుగాను కూటమిలోని టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందారు. వైసీపీ నుంచి 11 మంది విజయం సాధించారు. తొలుత సీఎం చంద్రబాబు, అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రమాణం చేస్తారు. వైసీపీ ప్రతిపక్ష హోదాను కోల్పోవడంతో జగన్ సాధారణ ఎమ్మెల్యే స్థాయిలోనే ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. అసెంబ్లీ స్పీకర్‌గా చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఎన్నుకుంటారు. ఇప్పటికే సచివాలయంలో శాఖాపరంగా మంత్రులు బాధ్యతలు స్వీకరించారు. ఇందులో 17 మంది కొత్తగా మంత్రిపదవులు పొందినవారున్నారు. శాసనసభ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఆర్ఎస్ఎస్ జోక్యంతోనే పేపర్ లీకేజీలు

రాహుల్‌గాంధీ విమర్శ

న్యూదిల్లీ: నీట్ పరీక్షల్లో అవకతవకలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నీట్ పేపర్ వివాదంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు కొనసాగిస్తోంది. కేంద్రప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. దిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో

- మిగతా 2 లో

నీట్‌పై కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీం నోటీసులు

2లో

నీట్ అక్రమాలపై వేర్వేరు రాష్ట్రాల హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్ల విచారణపై స్టే విధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.



విశాలాంధ్ర 72వ వార్షికోత్సవ సభ

22-6-2024 సా॥ 5 గంటలకు
చంద్రం బిల్డింగ్స్ (విశాలాంధ్ర), చుట్టుగుంట, విజయవాడ

స్వాగతం
ఆర్.వి. రామారావు గారు
ఎడిటర్, విశాలాంధ్ర దినపత్రిక

అధ్యక్షులు
ముప్పాళ్ళ నాగేశ్వరరావు గారు
విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు

ముఖ్య అతిథి
గౌరవ శ్రీ కె. పార్థసారధి గారు
గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు

అతిథి
గౌరవ శ్రీ కూనంనేని సాంబశివరావు గారు
తెలంగాణ రాష్ట్ర శాసనసభ్యులు

సందేశం
జి. ఓబులేసు గారు,
కోశాధికారి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి

అందరూ ఆహ్వానితులే
అభివందనములతో

జల్లి విల్సన్
కార్యదర్శి
విశాలాంధ్ర విజ్ఞాన సమితి
94909 52206

పి. హరినాథరెడ్డి
జనరల్ మేనేజర్
విశాలాంధ్ర విజ్ఞాన సమితి
94909 52000

ఇదీ లోకం!

కార్యకర్తలకు తోడుగా నిలుద్దాం

- త్వరలో బాధితులను కలుస్తా
- ఎవరూ భయపడొద్దు
- వయస్సుతో పాటు పోరాడే సత్తా ఉంది
- ఓటమి భావన తొలగించాలి
- పార్టీ నేతలకు వైసీపీ అధినేత జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : రాబోయే రోజుల్లో కార్యకర్తలను కలుస్తానని, నష్టపోయిన ప్రతి కార్యకర్తనూ కలిసి వారికి భరోసానిచ్చే కార్యక్రమం చేస్తానని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెల్లడించారు. తమ ఎమ్మెల్యే అభ్యర్థి తమ వద్దకు రాలేదనే మాట అనిపించుకోవద్దని, కార్యక్తలు కష్టాల్లోనూ మనతో ఉన్నారని, జెండాలు మోసి కష్టాలు పడ్డారని, వారికి తోడుగా నిలవాలని పార్టీ నేతలకు జగన్ దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు

- మిగతా 2 లో

65 శాతం రిజర్వేషన్లు చెల్లవు

పాట్నా హైకోర్టు తీర్పు

విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు కొట్టివేసింది.

2లో

అసెంబ్లీ ప్రోటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి

6లో

వెయ్యికి పెరిగిన 'హజ్' మృతులు!

వీరిలో 68 మంది భారతీయులు

దుబాయ్: సౌదీ అరేబియాలో భానుడి భగభగలు కొనసాగుతుండటంతో హజ్ యాత్రకు వెళ్లిన వారు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండ దెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోయిన యాత్రికుల సంఖ్య వెయ్యి మార్కును తాకినట్లు గురువారం మీడియా నివేదికలు పేర్కొన్నాయి. మృతుల్లో భారత్‌కు చెందిన 68 మంది ఉన్నారని సౌదీ దౌత్యాధికారి తెలిపారు. తాజా మృతుల్లో 58 మంది ఈజిప్టు పౌరులు ఉన్నట్లు చెప్పారు. మృతుల సంఖ్య 658కు చేరుకుందని, మరో 630 మరణాలు నమోదు కాలేదని దౌత్యాధికారి చెప్పినట్లు ఏఎఫ్‌పీ నివేదించింది. '68 మంది చనిపోయారు. వీరిలో వృద్ధులు ఉన్నారు. కొందరు సహజంగా మరణించగా, ఇంకొందరు వాతావరణ పరిస్థితుల కారణంగా చనిపోయారు' అని దౌత్యాధికారి చెప్పారు. మృతుల్లో 323 మంది ఈజిప్టు పౌరులు, 60 మంది జోర్డాన్‌కు చెందిన వారున్నట్లు ఇద్దరు అరబ్ దౌత్యాధికారులు మంగళవారం తెలిపిన విషయం తెలిసిందే. అయితే మృతుల్లో ఇండోనేసియా, ఇరాన్, సెనేగల్, టునీసియా, ఇరాక్ పరిధిలోని కుర్దిస్థాన్‌కు చెందిన వారు సైతం ఉన్నట్లు తెలిసింది.

ఆగ్నేయాసియాతో పటిష్ఠ బంధమే రష్యా లక్ష్యం

వియత్నాంలో పుతిన్ పర్యటన

హనోయ్/మాస్కో: ఆగ్నేయాసియా దేశాలతో పటిష్ఠ బంధాన్ని రష్యా కోరుకుంటోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో తమ దేశాన్ని ఏకాకి చేయాలన్న పశ్చిమ దేశాల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు మాస్కో యత్నిస్తోంది. ఆగ్నేయాసి దేశాలతో సఖ్యతను చాటుకునే ప్రయత్నాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేస్తున్నారు. మేలో ఐదవ సారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత ఆయన ఆగ్నేయాసి దేశాలపై దృష్టి పెట్టారు. తొలుత చైనా వెళ్లిన ఆయన తాజాగా ఉత్తర కొరియాలో పర్యటించారు. గురువారం వియత్నాం చేరుకున్నారు. పుతిన్ కోసం వియత్నాం ఎర్రతివాచీ పరిచింది. రాజధాని హనోయ్‌లోని నోయి బాయి అంతర్జాతీయ విమానాశ్రయంలో వియత్నాం ఉప ప్రధాని ట్రాంగ్ హోంగ్ హా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఉక్రెయిన్‌లో సంక్షోభ పరిష్కారానికి ఆచరణాత్మక మార్గానికి మద్దతిచ్చిన ఆగ్నేయాసియా కమ్యూనిస్టు దేశాన్ని పుతిన్ ప్రశంసించినట్లు వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పత్రిక ఒకటి పేర్కొంది. ప్రపంచ శక్తులతో 'బాంబూ డిప్లమసీ' అంటే తటస్థ విదేశీ విధానాన్ని వియత్నాం అనుసరిస్తుంది. ఇదే క్రమంలో ఉక్రెయిన్‌పై రష్యా దాడులను ఈ దేశం ఖండించలేదు. అయితే దీనిని క్రెమ్లిన్‌కు సాన్నిహిత్యతతో ముడిపెట్టాయి పశ్చిమ దేశాలు. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో రష్యాను ఏకాకి చేసేందుకు పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు పుతిన్ ఆగ్నేయాసియా దేశాల పర్యటనలు దోహదమవుతున్నాయి. ఆగ్నేయాసియాలో మూడవ దేశాన్ని ఆయన సందర్శించారు. వియత్నాం పర్యటనలో భాగంగా అగ్ర నాయకులతో భేటీ అవుతారని, ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. వియత్నాం వ్యవస్థాపక నాయకుడు హో చి మిన్ స్మారకాన్ని సందర్శించి ఆయనకు పుతిన్ నివాళులర్పిస్తారని పేర్కొన్నాయి. కాగా, పుతిన్ చివరగా 2017లో వియత్నాంలో పర్యటించారు. 1950 నుంచి వియత్నాంతో రష్యాకు దౌత్య సంబంధాలు ఉన్నాయి. వీరి స్నేహ బంధానికి ఈ ఏడాదితో 30ఏళ్లు పూర్తి అవుతాయి.

సూకీ 79వ జన్మదిన వేడుకలు

22 మంది అరెస్టు

నెప్యీడో: మైన్మార్ బహిష్కృత నాయకురాలు ఆంగ్ సాన్ సూకీ 79వ జన్మదినాన్ని పురస్కరించుకొని తనిన్‌త్యారీ ప్రాంతంలోని లౌంగ్లాన్ పట్టణంలో బైక్ ర్యాలీలు జరిగాయి. సూకీ పుట్టినరోజు జరిపిన కారణంగా 22 మందిని మైన్మార్ పోలీసులు అరెస్టు చేశారు. సూకీలా తలలో పూలు పెట్టుకొని ఫొటోలు పోస్టు చేసిన వారందని మాండలే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎలెవెన్ మీడియా తెలిపింది. తలలో పూలు పెట్టుకొని కలిసి ప్రార్థనలు చేసిన వారిని సెంట్రల్ మైన్మార్‌లో అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా కూడా పేర్కొంది. సూకీ 2021 నుంచి నిర్బంధంలో ఉండటం తెలిసిందే.

65 శాతం రిజర్వేషన్లు చెల్లవు

పాట్నా: విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు కొట్టివేసింది. ఈ పెంపు రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం స్పష్టం చేసింది. 65 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. బీహార్ వ్యాప్తంగా కులగణన చేపట్టి ఆ నివేదికను నితీశ్ సర్కారు గతేడాది నవంబరులో అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అదే సమయంలో విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లు పెంచుతూ సవరణ బిల్లు తీసుకొచ్చింది. ఈ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెరిగాయి. ఆర్థికంగా వెనుకబడినవారిని ఉద్దేశించిన 10 శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. ఈ పెంపుతో ఎస్సీలకు 16 నుంచి 20 శాతం, ఎస్టీలకు ఒక శాతం నుంచి రెండు శాతం, ఓబీసీ, ఈబీసీలకు కలిపి 30 శాతం ఉన్న రిజర్వేషన్ 43 శాతానికి పెరిగింది. ఈ పెంపుపై కొన్నివర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై రెండువర్గాల వాదనలు విన్న ధర్మాసనం... ఈ ఏడాది మార్చిలో తీర్పును రిజర్వు చేసింది. తాజాగా 65 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తూ తుది తీర్పు వెలువరించింది.

నీట్‌పై కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: నీట్ అక్రమాలపై వేర్వేరు రాష్ట్రాల హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్ల విచారణపై స్టే విధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ 2024 పరీక్ష రద్దు చేయాలని, పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కోర్టు పర్యవేక్షణ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కేంద్రంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వివరణ కోరింది. పేపర్ లీకేజీతో పాటు పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను హైకోర్టుల నుంచి సర్వోన్నత న్యాయస్థానానికి బదిలీ చేయాలని ఎన్‌టీఏ దాఖలు చేసిన నాలుగు వేర్వేరు పిటిషన్లపై సంబంధిత వర్గాల వివరణ కోరుతూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నేతృత్వ వెకేషన్ ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి హైకోర్టుల పరిధిలోని పిటిషన్ల విచారణపై స్టే విధించాలని ఎన్‌టీఏ తరపున న్యాయవాది కోరగా ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. తదుపరి విచారణను జులై 8వ తేదీన చేపడతామని, ఈలోగా హైకోర్టుల్లో విచారణలు జరపకుండా స్టే విధిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంది. నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపడం లేదని స్పష్టంచేసింది. 20 మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు 14 ఫిర్యాదులనూ విచారించింది. ఇందులో 49 మంది విద్యార్థుల 10 పిటిషన్లు.. ఎన్‌టీఏవి నాలుగు పిటిషన్లు ఉన్నాయి. కౌన్సెలింగ్ రద్దు చేయాలని విద్యార్థులు చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించింది. విద్యార్థుల పిటిషన్‌పై విచారణకు అంగీకరించింది. కౌన్సెలింగ్ ఎప్పటి నుంచి జరుగుతుందని ఎన్‌టీఏ తరపున న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించగా జులై 6 నుంచి అని ఆయన కోర్టుకు తెలిపారు. ఒక్కరోజులో ఈ ప్రక్రియ ముగిసిపోదని, ఇందుకు సమయం పడుతుందన్నారు. జులై 8న తాజా పిటిషన్లతో పాటు పెండింగ్ ఫిర్యాదులనూ విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఈలోగా వివరణ ఇవ్వాలని కేంద్రానికి, ఎన్‌టీఏకి స్పష్టంచేసింది. ఇదిలావుంటే, పరీక్షలో అక్రమాలు జరిగిన కేసులో బీహార్‌లో ఒక వ్యక్తి అరెస్టు అయినట్లు మరొక న్యాయవాది కోర్టుకు తెలిపారు. పరీక్షలో అక్రమాలు జరిగినట్లు బీహార్, గుజరాత్‌లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని, ఆయా వ్యవహారాల్లో స్టేటస్ రిపోర్టులు ఇవ్వాలని పోలీసులను ఆదేశించాలని న్యాయవాది కోరారు.

పిటిషనర్ల తరపున వాదనలు ఒకే విధంగా ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. విచారణ సమయంలో కేంద్రం తరపు న్యాయవాది వాదిస్తూ కోచింగ్ కేంద్రాలు కూడా పిటిషనర్లుగా అనేకసార్లు కోర్టును ఆశ్రయించారని అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 'వచ్చేందుకు వారికి హక్కు ఉంది. విద్యార్థులే వారి వ్యాపారం. వాళ్లతో, వారి హక్కులతో మీరు ఆడుకుంటేగనుక కోచింగ్ సెంటర్లు కోర్టులకు వస్తాయి' అని కేంద్రానికి చీవాట్లు పెట్టింది.

ఏమీ కొనలేం... తినలేం...

(మొదటిపేజీ తరువాయి)

కిలోతోనే సరిపెడుతున్నాడు. దీంతో కొనుగోలు శక్తి కూడా పడిపోయింది. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా దాదాపు రూ.100, వంకాయ రూ.80, బంగాళాదుంప రూ.100 చొప్పున పలుకుతున్నాయి. ఇదే రీతిలో రైతు బజార్లలోను ధరలు పెరిగిపోయాయి. వంకాయ రైతు బజారులో రూ.40, బంగాళాదుంప రూ.36, బెండ 35, పచ్చిమిర్చి రూ.56, ఉల్లిపాయ రూ.36కు కొంచెం అటూ...ఇటుగా ఉన్నాయి. గతంలో ఆకుకూరలు పది రూపాయలకు నాలుగు కట్టలు ఇస్తే... ఇప్పుడు రెండు కట్టలనే కుదించి విక్రయిస్తున్నారు. క్యాబేజీ, క్యారెట్, సొర, బీర, పొట్లకాయ తదితర కూరగాయల ధరలు సామాన్యుడికి అందడం లేదు. దీంతో మార్కెట్టుకు గానీ లేదా రైతు బజారుకుగానీ వెళ్లామా? వచ్చామా? అనే రీతిలో వినియోగదారుడు ఉన్నారు. కేవలం మొక్కుబడిగానే కొనుగోలు చేస్తున్నాడు. గతంలో రూ.200 నుంచి రూ.300 తీసుకుని రైతు బజారుకు వెళ్తే...సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు సంచిలో కనిపించడం లేదు. దీంతో తెచ్చిన కూరగాయలు రెండు, మూడు రోజులకే అయిపోతున్నాయి.

పప్పు ధరల మోత

కూరగాయలతోపాటు పప్పుల ధరలూ మోత మోగుతున్నాయి. కందిపప్పు, మినప, అల్లం, వెల్లుల్లి, కారం, పసుపు ఏది చూసినా ధరలు పెరిగిపోయాయి. కిలో పెసరపప్పు రూ.130, మినపగుళ్లు రూ.140, పంచదార రూ.45కు చేరువైంది. చింతపండు, ఇడ్లీ రవ్వ, మైదా...ఇలా అనేక నిత్యావసర వస్తువుల్లోను పెరుగుదల కన్పిస్తోంది. అల్లం, వెల్లుల్లి కిలో రూ.200 దాటేసింది. నిత్యం వంటింట్లో ఉండాల్సిన ఈ నిత్యావసరాలు క్రమేపీ తగ్గిపోతున్నాయి. ఎడాపెడా ధరలు పెరగడంతోనే సామాన్యుడు పొదుపుగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొనడంతో తాము ఆర్థికంగా చితికిపోతున్నామని వాపోతున్నారు. సబ్బులు, పేస్టులు...ఇలా సర్వం పెరగడంతో మహిళల వంటింటి పొదుపు బడ్జెట్ కుదించుకుపోతున్నది. ఇవి అందుబాటు ధరలో లేకపోవడంతో సామాన్యుడు వాటిని అరకొరగానే కొనుగోలు చేస్తున్నాడు. ప్రతి వస్తువుకూ సామాన్యుడు జీఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ...ఈ తరహాలో ధరలు పెరగడంతో పేదవాడు చితికిపోతున్నాడు. ప్రతినెలా కూరగాయలు, నిత్యావసరాల కోసం వినియోగదారుడు కొంత బడ్జెట్ కేటాయించడం ఆనవాయితీగా ఉండేది. ఈ నెలలో అది కేవలం పది రోజులకే అయిపోయింది. నెల మధ్యలో డబ్బులు లేక... బయట కూరగాయలు కొనుగోలు చేయలేక...ఉన్నవాటితోనే సర్దుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలకు తోడుగా నిలుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో గురువారం అసెంబ్లీకి, పార్లమెంటుకు పోటీ చేసిన అభ్యర్థులతో విస్తృతస్థాయి సమావేశాన్ని జగన్ నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి జగన్ పూలమాలలేశారు. జగన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని కార్యకర్తలకు తోడుగా ఉండాలని, వారిని పరామర్శించాలని సూచించారు. ఇప్పటికే పార్టీ తరపున వారిని ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నామని, పార్టీ ఇచ్చే సహాయాన్ని మీరు స్వయంగా అందించాలని కోరారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అందరికీ భరోసా ఇవ్వాలని, వారిని బెదిరించే కార్యక్రమాలు, జోరుగా ప్రలోభాలు జరుగుతున్నాయని, రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారన్నారు. ఎవరూ భయపడవద్దని, మీ నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులను పిలిచి మాట్లాడాలని సూచించారు. సోషల్ మీడియా కార్యకర్తలను, మన కోసం నిలబడ్డ వలంటీర్లను, వైసీపీ జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలని కోరారు. ఓడిపోయామన్న భావనను మనసులో నుంచి తీసేయాలని, మనం ఓడిపోలేదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. న్యాయంగా, ధర్మంగా మనం ఓడిపోలేదని, ప్రతి ఇంట్లోనూ వైసీపీ ప్రభుత్వం చేసిన మంచి ఉందని, ప్రతి ఇంటికీ మనం తలెత్తుకుని పోగలమని చెప్పారు. మోసపోతున్న వారికి పార్టీ నేతలు అండగా నిలవాలన్నారు. ఎప్పుడూ చూడని విధంగా కార్యకర్తలపైనా, సానుభూతిపరులపైనా దాడులు చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల అవమానాలు, ఆస్తుల నష్టాలు చేస్తున్నారని, వాళ్లందరికీ భరోసా ఇవ్వాలని కోరారు. మనలో నిరాశకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటివ్వకూడదని, ధైర్యంగా అడుగులు ముందుకు వేయాలన్నారు.

ప్రత్యేక హోదా అడగకపోవడం చంద్రబాబు తప్పిదమే

ఎన్డీఏలో తాను చక్రం తిప్పుతున్నట్లుగా మోదీ పక్కన కూర్చుని చంద్రబాబు కనిపిస్తాడని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగకపోవడం... శిశుపాలుడి పాపాల్లో ఒకటి అని జగన్ వ్యాఖ్యానించారు. అలా అడగలేని మనిషి రాష్ట్రానికి, యువతకు ఏం సమాధానం చెబుతాడని ప్రశ్నించారు. తనకు వయసుతో పాటు సత్తువ కూడా ఉందని చెప్పారు. చంద్రబాబు పాపాలు పండే కొద్దీ... ప్రజలతో కలిసి చేసే పోరాటాల్లో వైసీపీకి, జగన్‌కు ఎవరూ సాటిరారన్నారు. ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు, ప్రజల తరపున పోరాటాలు చేస్తామన్నారు. వైసీపీ సంఖ్యాబలం తక్కువే ఉన్నందున అసెంబ్లీలో మనం చేసేది తక్కువేనని అన్నారు. ఏకంగా స్పీకర్ పదవికి తీసుకోబోయే వ్యక్తి మాట్లాడుతున్న మాటలు సోషల్ మీడియాలో చూస్తున్నామని జగన్ వివరిస్తూ... జగన్ ఓడిపోయాడు, చనిపోలేదని ఒకరు అంటారని తెలిపారు. చచ్చేదాక కొట్టాలని ఇంకొకరు అంటారని, ఇలాంటి కౌరవులు ఉండే సభకు మనం వెళ్లాల్సి ఉందన్నారు. పాపాలు పండే కొద్దీ ప్రజలతో కలిసి, ప్రజలతో నిలబడి చేసే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఊపందుకుంటాయని చెప్పారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామని, అమలు చేసిన మేనిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకెళ్లామని చెప్పారు. రూ.2.70 లక్షల కోట్లు ప్రజలకు డీబీటీ ద్వారా ఇచ్చామని వివరించారు. 66 లక్షల మంది పెన్షనర్లకు ఇంటికెళ్లి పంపిణీ చేశామని, 54 లక్షల మంది తల్లులకు అమ్మఒడి అందించామని, 53 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇచ్చామని, అయినా వారి ప్రేమలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సమావేశానికి వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారామ్, సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని, కన్నబాబు, ముత్తంశెట్టి, రోజా, పార్టీ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు హాజరయ్యారు.

మూడు గంటలు గాల్లో చక్కర్లు

సురక్షితంగా విమానం ల్యాండింగ్

హైదరాబాద్: సాధారణంగా టేకాఫ్‌కి ముందు విమానాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఎలాంటి అవాంతర సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండాలన్న ఉద్దేశంతో లోపాలేమైనా ఉన్నాయా అని పూర్తిగా సమీక్షిస్తారు. అంతా సక్రమంగా ఉన్న తర్వాతే దాన్ని రన్‌వేలోకి తీసుకొస్తారు. అయితే ఇలాంటి భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ కొన్నిసార్లు అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటుంటాయి. అలాంటి సంఘటనే తాజాగా వెలుగు చూసింది. గాల్లోకి ఎగిరిన తర్వాత ఓ విమానంలోని ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. పైలట్ వెంటనే అప్రమత్తమై అత్యవసర ల్యాండింగ్ చేసి ప్రయాణికులను రక్షించాడు. విషయం ఏమంటంటే...మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎంహెచ్ 199 అనే విమానం బుధవారం అర్ధరాత్రి (12:45) దాటిన తర్వాత హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. గాల్లో ఎగిరిన కాసేపటి వరకూ ప్రయాణం సజావుగానే సాగింది. కొంత దూరం వెళ్లిన తర్వాత ఒక ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఆ ఇంజిన్‌కి పక్కనే కూర్చున్న ఓ ప్రయాణికుడు ఆ దృశ్యాలను తన ఫోన్‌లో రికార్డ్ చేశాడు. ఇలా ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో విమానం వేగం తగ్గింది. ఈ విషయాన్ని పసిగట్టిన పైలట్... విమానాన్ని తిరిగి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకి తీసుకొచ్చాడు. కొద్దిసేపు గాల్లో చక్కర్లు కొట్టాక... తెల్లవారుజామున 3:21 గంటల సమయంలో ల్యాండ్ చేశాడు. ప్రయాణికులను సురక్షితంగా దించేసి... ఆ విమానాన్ని తనిఖీ కోసం తీసుకెళ్లారు. ఈ ఘటన గురించి ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ ప్రతినిధి మాట్లాడుతూ సాంకేతిక లోపం వల్లే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయని తెలిపారు. ఆ విమానాన్ని తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంజిన్‌లో మంటలు చెలరేగిన వెంటనే విషయాన్ని గుర్తించి పైలట్స్ ఎంతో చాకచక్యంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు తిరిగి తీసుకొచ్చారని అన్నారు. ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు చేర్చేందుకుగాను ఇతర విమానాలు కేటాయించామన్నారు. తమ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల భద్రత విషయంలో ఏమాత్రం రాజీ పడదని పేర్కొన్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో విమానంలో 130 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ జోక్యంతోనే పేపర్ లీకేజీలు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం జరిగిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ పేపర్ లీకేజీలు ఆపడం ప్రధాని మోదీకి ఇష్టం లేనట్లు కనిపిస్తోందన్నారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆపినట్లు మోదీ చెప్పుకుంటారని, కానీ దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం ఆయన ఆపలేకపోతున్నారని రాహుల్ విమర్శించారు. విద్యావ్యవస్థలో బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చొరబడిన కారణంగానే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యావ్యవస్థపై ఆర్‌ఎస్‌ఎస్ పెత్తనం పోయినప్పుడే పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన ప్రధాని మోదీ... పేపర్ లీకేజీలతో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లో అర్హత లేని వీసీలను బీజేపీ మాతృసంస్థ సిఫార్సులతో నియమించిన కారణంగానే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధాని మోదీ మానసికంగా బలహీనమయ్యారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడిపించేందుకు ఆయన తెగ ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ప్రధాని విద్యార్థుల గురించి ఆందోళన చెందడం లేదని, ఎన్నికల్లో మోదీ అనే కాన్సెప్ట్ నాశనమైనట్లు రాహుల్ గాంధీ అన్నారు. మోదీకి ఎవరూ భయపడడం లేదని, గతంలో ఆయన ఛాతీ 56 అంగుళాలు ఉండేదని, ఇప్పుడు మోదీ ఛాతీ 32 ఇంచులకు చేరుకున్నదని, భయపెట్టి, బెదిరించి పనిచేయించుకోవడం ఆయనకు అలవాటు అని, అయితే, ఇప్పుడు ఆ భయం ఎవరికీ లేదని అన్నారు. వారణాసిలో ఒకరు ఆయనపై చెప్పులు విసిరేశారని, ఎన్నికలకు ముందు మాత్రం ఆయన్ను తాకేందుకు జనం వణికేవారన్నారు. నరేంద్ర మోదీ అన్న కాన్సెప్ట్‌ను ప్రతిపక్షాలు ధ్వంసం చేశాయన్నారు. ఇప్పుడు చాలా బలమైన ప్రతిపక్షం ఉందని, ఇది చాలా ఆసక్తికరమైన సమయమన్నారు. నోట్ల రద్దుతో ఎలా ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారో, ఇప్పుడు విద్యా వ్యవస్థకు అదే జరుగుతోందన్నారు.

నేడు దేశవ్యాప్తంగా నిరసనలు

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై శుక్రవారం దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. విద్యార్థులకు న్యాయం చేయాలంటూ నిరసనలు నిర్వహించాలని వివిధ రాష్ట్రాల్లోని పార్టీ శాఖలను ఆదేశించింది. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం తెలిపారు. అన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు.

సంపద సృష్టి కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానం పూర్తైతే రాయలసీమ రతనాల సీమ అవుతుంది. అటువంటి ప్రాజెక్టును సర్వనాశనం చేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా సీఎం అయితే మంచి కార్యక్రమంతో ప్రజలను మెప్పిస్తారు. కానీ ప్రజావేదిక కూల్చి జగన్ పాలన ప్రారంభించారు. రాజధానిలో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. పైగా ఇష్టానుసారం విధ్వంసం చేశారు. పైపులు, ఇసుక దొంగతనం చేయడంతో పాటు రోడ్లను కూడా తవ్వుకుపోయారు. ఒక్క బిల్డింగు కూడా పూర్తి చేయలేదు. రోడ్ల నిర్మాణాలన్నీ సగంలో ఆగిపోయాయి. కొన్ని బిల్డింగులు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీల భవనాలు, మంత్రుల భవనాలు, గెజిటెడ్ అధికారులు, నాన్ గెజిటెడ్ అధికారుల భవనాల నిర్మాణం ప్రారంభించాం. ఆ పనులన్నీ అర్థాంతరంగా నిలిపేశారు. శ్వేతపత్రం విడుదల చేసి రాజధాని ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు వివరాలన్నీ తెలుపుతాం. ప్రజల్లో కూడా గత ప్రభుత్వం విధ్వంసంపై చర్చ జరగాలి. ఏం చేయాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉందని చంద్రబాబు అన్నారు.

'తెలుగుజాతి గర్వంగా, గౌరవంగా తలెత్తుకు తిరిగే రాజధాని అమరావతి. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలనుకున్నాం. కేంద్రం 12 విద్యాసంస్థలు ఇచ్చింది. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, మంగళగిరిలో ఎయిమ్స్, విశాఖలో ఐఐఎం, తాడేపల్లిలో ఎన్ఐటీ, ఒంగోలులో ఐఐటీ, విజయనగరంలో గిరిజన యూనివర్సిటీని ప్రాంతాల వారీగా నెలకొల్పాం. కానీ గత ప్రభుత్వం ఏదీ జరగనివ్వలేదు. ముందుకు సాగనివ్వలేదు. రాజధానిపై ఇష్టారీతిన బురదజల్లారు. నిత్యం విషప్రచారం చేశారు. బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అన్నారు. స్విస్ ఛాలెంజ్‌లో మోసం అన్నారు. సింగపూర్ కన్సార్టియంపైనా విషం చిమ్మి తరిమేశారు. రాష్ట్రానికి మధ్యలో ఉండేలా ఎక్కడైనా రాజధాని పెట్టండని శివరామకృష్ణ కమిటీ నివేదికలో చెప్పింది. దానికి అనుగుణంగానే 12 పార్లమెంట్ స్థానాలు ఒకవైపు, మరో 12 పార్లమెంట్ స్థానాలు ఇంకోవైపు ఉండేలా చూసి గుంటూరు సెంట్రల్‌గా అమరావతిని రాజధానిగా గుర్తించామని చంద్రబాబు వివరించారు.

మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట

'మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు. ఒక ప్రాజెక్టు కట్టాలంటే భూమి ఇవ్వడానికి ఇష్టపడని ఈ రోజుల్లో రాజధాని కోసం ముందుకు వచ్చి రైతులు 34 వేల ఎకరాల భూములు ఇచ్చారు. రైతులు ఇచ్చిన భూములు, ప్రభుత్వ భూముల్లో రోడ్లు, బిల్డింగులు, ఇతర నిర్మాణాలు పోను మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని నేను మొదటి నుండి చెప్తూనే ఉన్నా. ఇక్కడ వచ్చే ఆదాయమే రాజధాని నిర్మాణానికి సరిపోతుంది. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు కూడా రాజధాని నుండి వచ్చే సంపదతోనే అమలు చేయవచ్చు. కానీ గత పాలకులు మూర్ఖత్వంతో విధ్వంసానికి పాల్పడ్డారని సీఎం మండిపడ్డారు. బ్రహ్మాండంగా ఉండాల్సిన రాజధానిలో తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలతో కమ్మేసుకుంది. జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత ఉందా అనేది ప్రజల్లో చర్చ జరగాలి. రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొస్తాం. రాజధానిని పునర్నిర్మిస్తాం. అందరి సహకారం, భాగస్వామ్యంతో రాజధాని నిర్మాణం జరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎం వెంట మున్సిపల్ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, కొలికపూడి శ్రీనివాస్, ఆయా శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు. రాజధాని రైతులు పెద్దసంఖ్యలో చంద్రబాబు పర్యటనలో పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి 'పరీక్ష పే చర్చ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం దేశ విద్య, నియామక వ్యవస్థను ఎలా నాశనం చేసిందో నీట్, యూజీసీ-నెట్, సీయూఈటీ (ఉమ్మడి అర్హత ప్రవేశ పరీక్ష)లో పేపర్ లీక్‌లు, మోసం, స్థూల అవకతవకలు ఇప్పుడు బట్టబయలయ్యాయని తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంటులో సమాధానాలు కోరినప్పుడల్లా మోదీ ప్రభుత్వం కాలయాపన చేస్తూనే ఉందని, సాకులు చెబుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కేంద్రంపై మండిపడ్డారు. బీజేపీ పాలనలో పేపర్ మాఫియా 'పరీక్షలను రిగ్గింగ్' చేస్తోందని అన్నారు. పోలీసు నియామక పరీక్ష లీక్ అయితే, అది శాంతిభద్రతలపై ప్రభావం చూపుతుందని, నీట్ పరీక్షలో మోసం జరిగితే నిజాయతీపరులు వైద్యులు కాలేరని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అలాగే యూజీసీ-నెట్ పరీక్ష రద్దు విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో క్షుణ్ణంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో పరీక్షల ప్రక్రియ కుప్పకూలిందని, విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ సాకేత్ గోఖలే అన్నారు. 'మన దేశంలో పరీక్షా ప్రక్రియ నిర్మాణం కుప్పకూలింది. పేపర్ లీక్‌లు, అక్రమాలు ఎక్కువయ్యాయి. పనికిరాని ఎన్‌టీఏ దానికి సహకరించింది' అని గోఖలే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నీట్ వైఫల్యం, విద్యార్థులు పరీక్ష రాసిన ఒక రోజు తర్వాత యూజీసీ-నెట్ రద్దయింది. మన విద్యార్థుల జీవితాలు, భవిష్యత్ ప్రతిరోజూ నాశనమవుతున్నాయి. మోదీ ప్రభుత్వం బాధ్యత వహించడానికి కూడా సిగ్గుపడదు' అని ఆయన విమర్శించారు. ఎన్నికల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇద్దరినీ బర్తరఫ్ చేయాలని టీఎంసీ ఎంపీ డిమాండ్ చేశారు. 'అసమర్థ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ విషయంలోనూ అదే జరిగింది. ఇప్పుడు మనం కొద్ది రోజుల క్రితం రైలు ప్రమాదం చూశాం. వారిని బర్తరఫ్ చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో తనకు ఎదురైన అవమానాల నుంచి మోదీ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తోందని సీపీఎం 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. 'మొదట సీయూఈటీలో వైరుధ్యాలు చోటుచేసుకున్నాయి. తరువాత నీట్ కుంభకోణం. ఇప్పుడు యూజీసీ-నెట్ రద్దయింది! బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా అపహాస్యం చేసింది' అని తెలిపింది. నీట్ పరీక్షను కూడా రద్దు చేయాలని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) ఎంపీ మనోజ్ ఝా అన్నారు. 'మీరు యూజీసీ-నెట్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ పరీక్షలో అవకతవకలకు తగినంత రుజువు ఉన్నందున మీరు ఇప్పుడు నీట్‌ను రద్దు చేయాలి. ఎన్‌టీఏ ఒక మోసం అని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ఆయన తెలిపారు. యూజీసీ-నెట్ అనేది భారతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా, పీహెచ్‌డీలో ప్రవేశానికి, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డుకు భారత జాతీయుల అర్హతను నిర్ణయించడానికి ఒక పరీక్ష. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రిత్వ శాఖ యూజీసీ-నెట్‌ను రద్దు చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే నీట్ అంశం ఇప్పుడు సుప్రీం కోర్టులో ఉంది.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎన్‌టీఏ ద్వారా నీట్-యూజీ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. కాగా, సీపీఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ యూజీసీ-నెట్ పరీక్షలో అడిగే ప్రశ్నలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యారంగాన్ని 'కాషాయీకరణ' చేస్తున్నారని విమర్శించారు. 'ఎప్పుడైతే నీట్ నుంచి నెట్ వరకు కుప్పకూలిందో... కాషాయీకరణ (ప్రశ్నలు) ఎలా జరుగుతుందో చూడండి. ఒక విద్యార్థికి నెట్ ప్రశ్నలు... అయోధ్య ప్రాణప్రతిష్ఠ తేదీ, మన తర్వాతి తరాన్ని ఎలా తీర్చిదిద్దాలనుకుంటున్నాం?' అని పేర్కొన్నారు. బ్రిట్టాస్ యూజీసీ-నెట్‌కు చెందిన కొన్ని చిత్రాలను పంచుకున్నారు. ఇది రామ మందిరానికి ప్రాణప్రతిష్ఠ తేదీని, రామాయణం, మహాభారతం, ఇతర మత గ్రంథాలకు సంబంధించిన ఇతర ప్రశ్నలను అడిగారు.

పరీక్ష ముందు రోజే ప్రశ్న పత్రం లీక్

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించారు. మరుసటి రోజు పరీక్షలో అవే ప్రశ్నలు వచ్చాయని సమాధానమిచ్చినట్లు పోలీసులు తెలిపారు. పరీక్షకు ముందు రోజు రాత్రి ప్రశ్నపత్రం చదివానని, సమాధానాలు గుర్తుపెట్టుకున్నానని అనురాగ్ యాదవ్ తెలిపారు. మరుసటి రోజు పరీక్ష హాలులో అదే ప్రశ్నపత్రం వచ్చిందని, పరీక్ష తర్వాత పోలీసులు తనను అరెస్ట్ చేశారని, తాను నేరం అంగీకరించానని అన్నారు. ఏ పోటీ పరీక్ష ప్రశ్నపత్రమైనా లీక్ చేయవచ్చని, నీట్ ప్రశ్నపత్రానికి ఒక్కొక్కరికీ రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని అమిత్ ఆనంద్, నితీశ్ కుమార్ తనతో చెప్పారని యాదవేందు పేర్కొన్నారు. నలుగురు విద్యార్థులు ఉన్నారని, వారు పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు సహాయం కావాలని వారిని కోరారని యాదవేందు తెలిపారు. జూన్ 4వ తేదీ రాత్రి ఆ విద్యార్థులను తనతో పాటు తీసుకువెళ్లానని, ఇద్దరు నిందితులు వారికి ప్రశ్నపత్రం ఇచ్చారని అన్నారు. అయితే తాను ఒక్కొక్కరిని రూ.30 లక్షలకు బదులుగా రూ.40 లక్షలు అడిగానని పోలీసులకు తెలిపారు. మరుసటి రోజు వెహికల్ చెకప్‌లో విద్యార్థుల అడ్మిట్ కార్డులతో పట్టుబడ్డానని, నేరాన్ని అంగీకరించినట్లు చెప్పారు.

వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రి సత్యప్రసాద్‌ను ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తన దృష్టికి తీసుకొస్తే, త్వరలో సమావేశం నిర్వహించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన ఛాంబరులో సంఘం నేతలు కలిశారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు భూపతి రాజు రవీంద్రరాజుతో పాటు రాష్ట్ర కోశాధికారి మౌళిబాషా, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనూష, అసోసియేషన్ నాయకులు కె.సత్తిబాబు, నళిని కుమార్, గోపాలకృష్ణ తదితరులున్నారు.

సమాజంలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం

షీలానగర్ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మానం

విశాలాంధ్ర-గాజువాక (విశాఖ జిల్లా): సమాజంలో సహకార బ్యాంకుల పాత్ర కీలకమని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు అన్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ 51వ బ్రాంచ్‌ను గురువారం షీలానగర్‌లో ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ సభ్యులకు మెరుగైన సేవలందిస్తూ వారి మన్ననలను పొందిందని అన్నారు. బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ తమ కో ఆపరేటివ్ బ్యాంక్ 109 వసంతాలు పూర్తి చేసుకొని 110వ వసంతంలోకి అడుగు పెడుతుందని అన్నారు. రూ.4,148.30 కోట్ల డిపాజిట్‌లతో రూ.87.79 కోట్ల లాభాలతో నడుస్తుందని వివరించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ, దేశంలోనే ప్రముఖ సహకార బ్యాంకుగా రాణిస్తుందన్నారు. ఆర్బీఐ అనుమతులతో నూతన శాఖలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సహకార రంగంలో బ్యాంకులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా యని అన్నారు. షీలానగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల కోసం ఇక్కడ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు ఏజే స్టాలిన్, జేవీ సత్యనారాయణ మూర్తి, జి.జనార్దన్ రావు, రామచంద్రరాజు, రామకృష్ణ, కృష్ణ మోహన్, కామరాజు, కాకి భవాని, ఉప్పల పాటి పార్వతిదేవి, సీఈవో నరసింహ మూర్తి, జోనల్ మేనేజర్ గణేశ్, బ్రాంచ్ మేనేజర్ దోనబోయిన వెంకటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలు పునరుద్ధరించండి

రవాణాశాఖ మంత్రికి ఈయూ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల ఉద్యోగులు కోల్పోయిన అన్ని ప్రయోజనాలను పునరుద్ధరించాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డిని గురువారం ఆర్టీసీహౌస్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 20 డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని మంత్రికి అంద జేశారు. ఆర్టీసీ ఉద్యోగులు... విలీనం ఎందుకుకోరుకున్నారో, ఇప్పుడు ఏం జరుగుతుందన్న విషయాన్ని యూనియన్ నేతలు మంత్రికి వివరిం చారు. ప్రధానంగా విలీనంతో పాత పెన్షన్ వస్తుందని అనుకుంటే... ఎస్ఆర్‌బీఎస్ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేశారన్నారు. విలీనానికి ముందు ఒక్క రూపాయి ఖర్చులేకుండానే ఉద్యోగి, వారి కుటుంబ సభ్యులకు ఎంతఖర్చు అయినాసరే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్యసేవలు అందించే విధానం ఉండగా, దానిని రద్దు చేశారన్నారు. దీంతో సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటినెన్స్ సిబ్బందికి ఇచ్చే ఇన్‌సెంటివ్ పథకాలు, ఉద్యోగు లకు ఇచ్చే కొన్ని అలవెన్సులను రద్దుచేశారని, వీటిన్నంటినీ పునరుద్ధరిం చాలన్నారు. స్పందించిన మంత్రి ఆయా డిమాండ్లు, సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటా నని చెప్పారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, రాష్ట్రనాయకులు మందపాటి శంకర రావు, ఎం.కోటేశ్వరరావు, కె.బాలాజీ, జీఎస్ నారాయణ, కె.కోటేశ్వరరావు, ఎస్.ఎస్. నారాయణ, ఎన్.చక్రవర్తి, విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఇతర జోన్, జిల్లా , డిపో నాయకులు పాల్గొన్నారు.

'నీట్, యూజీసీ నెట్' లీకేజీపై

సిట్టింగ్ జడ్జితో విచారణ

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) చిత్తూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి మాట్లాడుతూ... నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం... అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందినవారు కావడం వెనుక బీహార్‌కు చెందిన ముఠా పనే అన్నారు. ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి రూ.30 లక్షలు వసూలు చేసిన నిందితులు దొరికినా వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గ మన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడు దల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతున్నా, కేంద్రం నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు.

యూజీసీ నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని, నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని అన్నారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 24 లక్షల మంది విద్యార్థులకు మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఎన్టీఏ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని లేనిపక్షంలో వారి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్, జిల్లా నాయకులు షేక్ బాబు, ఆదిల్, చరణ్, లోకేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం

బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన భూ వ్యవహారాల సమస్యలతో పాటు, సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేలా రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తారని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్లశాఖ మంత్రిగా సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన అనగాని సత్యప్రసాద్‌ను బొప్పరాజుతోపాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టీఈ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీ కృష్ణనాయుడు, ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, ఏపీ క్లాస్-4 ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మీ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

రూ.వెయ్యిలోపు పాదరక్షలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలి

విశాలాంధ్ర-విజయవాడ: వెయ్యి రూపాయల లోపు పాదరక్షలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర జీఎస్టీ మండలికి సిఫార్సు చేయాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యా వుల కేశవ్‌కు ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రిని ఆయన కార్యాలయంలో గురువారం కలిసి రాష్ట్రంలో ఫుట్‌వేర్ ప్రస్తుత పరిస్థితిని అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ వివరించారు. ఈ అంశంపై స్పందించిన మంత్రి కేశవ్ రాష్ట్రం నుంచి కేంద్ర జీఎస్టీ మండలికి తక్షణమే సిఫార్సులు పంపిస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.ఈశ్వరరావు, హెచ్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీకి ఆర్టీసీ యూనియన్ సత్కారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర డీజీపీగా పదోన్నతి పొందిన ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సిహెచ్.ద్వారకా తిరుమలరావును ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సత్కరించింది. విజయవాడ ఆర్టీసీ బస్సు హౌస్‌లోని ఎండీ ఛాంబర్‌లో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ద్వారకా తిరుమలరావు ... ఆర్టీసీకి అందించిన సేవలను నేతలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య, రాష్ట్ర, జోనల్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లైసెన్స్ కూలీల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ: ఆర్టీసీ లైసెన్స్ కూలీల సమస్యలు పరిష్కరిస్తా మని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం పర్యటించిన మంత్రి ప్రయాణికులు, హోటళ్లు, దుకాణాల యజమానులు, కార్గో కార్మికులతో మాట్లాడారు. కార్గో పాయింట్లలో పని చేస్తున్న హమాలీలను పలకరించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లైసెన్స్ కూలీల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రాంబాబు లైసెన్స్ కూలీల సమస్యలను మంత్రికి వివరించారు. లైసెన్స్ కూలీలకు 2023 జనవరి నుంచి కొత్త కూలి రేట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంత వరకు ఇవ్వలేదని, అనేక పర్యాయాలు చర్చలు జరిపి చివరకు మొండి చేయి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లైసెన్స్ కూలీలకు పని డబ్బులు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. కార్మికులు 24 గంటలూ విధులు నిర్వహిస్తూ నిద్ర ఆహారాలు సరిగా లేక చాలా బాధపడుతున్నారని తెలిపారు. ఈ కార్మికులకు ఎలాంటి సామాజిక భద్రత సౌకర్యాలు, పీఎఫ్, ఈఎస్ఐ లాంటివి లేవని వివరించారు. ఈ అంశాలపై మంత్రి స్పందిస్తూ కార్మికుల కోసం, కష్టపడి పనిచేసే వారి కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుం దని అన్నారు. ఇప్పుడిప్పుడే అన్ని విషయాలు తెలుసుకుంటున్నామని, కాస్త ఓపికతో ఉండాలని, తప్పకుండా తమ ప్రభుత్వం సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. కార్మికులంతా శ్రద్ధగా పని చేయాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సరుకు రవాణా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్ కూలీల యూనియన్ నాయకులు వేముల వాసు, గుంజ వాసు, దండగల శ్రీను, లైసెన్స్ కూలీలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు ఎప్పుడు చంద్రబాబూ?

- హామీలు పక్కదారి పట్టించేందుకే రుషికొండ
- టీడీపీ బెదిరింపులకు భయపడం: కొడాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబూ... వాటిని ఎప్పుడు అమలు చేస్తావో చెప్పాలంటూ మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసీపీ అధినేత జగన్ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కదారి పట్టించేందుకుగాను రుషికొండ, వైసీపీ శ్రేణులపై దాడులు, క్యాంపు కార్యాలయంలో ఫర్నీచర్ తదితర అంశాలను చంద్ర బాబు తెరపైకి తెచ్చారన్నారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జులై ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవ్వాతాతలకు రూ.ఏడు వేల పెన్షన్, 19 ఏళ్లు దాటిన ప్రతి మహిళలకు నెలవారీ రూ.1,500, మూడు సిలెండర్లు, తల్లిదీవెన, ఉచిత బస్సు ప్రయా ణం తదితర హామీలను నెరవేర్చాలన్నారు. రుషికొండ లోని పర్యాటక ప్రాంతంలో ఆధునిక వసతులతో తమ ప్రభుత్వం నిర్మించిన భవనాలను... జగన్ మోహన్‌రెడ్డివిగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేయడాన్ని నాని ఖండిచారు. నాడు జగన్ ప్రతిపక్షం నుంచి అధికార పక్షం వరకు సొంత ఇళ్లు, కార్యాల యాల్లోనే కార్యకలాపాలను కొనసాగించారని గుర్తు చేశారు. ప్రభుత్వం కట్టించిన ఇళ్లు, అతిథి గృహాల్లో ఉండే పరిస్థితి జగన్ రక్తంలోనే లేదన్నారు. సీఎంగా ఉన్నప్పుడు జగన్ క్యాంపు కార్యాలయానికి ఫర్నీ చర్‌ను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. అవేమీ తాము వైసీపీ ఆఫీసుకుగాని, సాక్షి ఆఫీసుకుగాని తరలించలేదని స్పష్టంచేశారు. మేం వాటికి వెలకట్టి డబ్బులు ఇస్తామని చెప్పామని, లేకుంటే తీసుకు పోయినా ఫర్వాలేదని నొక్కిచెప్పారు. గతంలో కోడెల ప్రసాద్ తరహాగా తామేమీ అసెంబ్లీ ఫర్నీచర్‌ను దొంగతనంగా షోరూమ్‌లో పెట్టుకోలేదని గుర్తు చేశారు. వైసీపీ నుంచి మొదటగా మీరే లక్ష్యమని అంటూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కొడాలి బదులిస్తూ, ఈ ప్రజాస్వామ్య దేశంలో ఎవర్ని ఎవరు టార్గెట్ చేసినా... వైసీపీ ఆగబోదన్నారు. తననే కాదని, తమ అధినేత జగన్‌నే లక్ష్యం చేస్తారన్న అనుమానం వ్యక్తం చేశారు. జగన్‌ను ఎవరూ ఏమీ చేయలేరంటూ తనదైన శైలిలో నాని బదులిచ్చారు. ఎన్నికలు జరిగి 15 రోజులు ఇంకా అవ్వకముందే... కమిటీ సిఫార్సులు రాకముందే, జగన్ ఇంటి ముందు భద్రతను తొలగించి, రహదారిలో రాకపోకలకు అవకాశం కల్పించారన్నారు. జగన్ ఇంటి దగ్గరకు టీడీపీ అనుకూల మీడియాను తీసుకొచ్చి జగన్ ఇంటికి ఎలా వెళ్లాలి అనే మార్గాన్ని వారే చూపిస్తు న్నారని మండిపడ్డారు. ఇక్కడ ఎవరు దొరికితే వారు లక్ష్యమని, ఇలాంటి బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదన్నారు. ఎవరు ఎవరికి లక్ష్యం అనేదీ భగవంతుడు నిర్ణయిస్తాడని, వాటిని రాబోయే రోజుల్లో చూద్దామని తెలిపారు. టీడీపీ, జనసేన శ్రేణుల దాడులకు గురైన వారిని, పార్టీ ఓటమితో చనిపోయిన వారి కుటుంబా లను జగన్ పరామర్శించనున్నారని చెప్పారు.

నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం

14 ఇళ్లు దగ్ధం... దివ్యాంగురాలు దుర్మరణం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నెల్లూరు నగరం రంగనాయకుల పేటలోని బర్మాషెల్ గుంటలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం మధ్యాహ్నం ఒక పూరి గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు 14 ఇళ్ల వరకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. నాగలక్ష్మి అనే 12 ఏళ్ల దివ్యాంగురాలు మంటల్లో కాలి దుర్మరణం చెందింది. పెద్ద ఎత్తున వ్యాపించిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. భారీ అగ్ని ప్రమాదంతో ఈ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. సర్వం కోల్పోయిన బాధితుల ఆర్తనాదాలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఈ ఘటనపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రాంనారాయణ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తన సొంత నిధుల నుంచి ఒక్కొక్క

కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.15 వేలు చొప్పున, చనిపోయిన దివ్యాంగురాలి కుటుంబానికి రూ.30 వేలు ప్రకటించారు. మంత్రి తరపున మాజీ మేయర్, తెలుగుదేశం పార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్ బాధితులకు నగదును అందజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం సంభవించిందని, విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సహాయ చర్యలను చేపట్టిందని కలెక్టర్ చెప్పారు.

ఇక... ముద్రగడ పద్మనాభరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం పేరు... ఇక నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డిగా మారిపోయింది. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ జిల్లా పిఠాపురంలో జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ఓడిస్తానని, అలా కాకుంటే తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని ఆయన శపథం చేశారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిగా జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తులతో పోటీకి దిగాయి. దీంతో జనసేన 21 సీట్లలో టీడీపీ, బీజేపీ మద్దతుతో పోటీ చేసింది. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ పిఠాపురంలో పోటీ చేశారు. ఆయనపై వైసీపీ తరపున వంగా గీతను బరిలోకి దించగా, ఆమె గెలుపు కోసం వైసీపీ నేతలంతా ఏకమయ్యారు. వారిలో ముద్రగడ పద్మనాభం కీలకంగా నిలిచారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని రీతిలో పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయనతోపాటు మిగిలిన 20 నియోజకవర్గాల్లోను జనసేన అభ్యర్థులు విజయం సాధించారు. ఈ విజయాన్ని వైసీపీ నేతలు ఎవరూ ఊహించలేదు. దీంతో ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ముద్రగడ మీడియా ముందుకు వచ్చి తాను చేసిన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని... తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటూ గెజిట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నానని వెల్లడించారు. ఇదే సమయంలో మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమిస్తానని తెలిపారు. చాలా మంది కాపు నేతలు ఆయనను తొందరపడవద్దని, దరఖాస్తు చేయవద్దని సోషల్ మీడియా వేదికగా సూచించారు. ఎక్కడా వెనక్కి తగ్గకుండా ముద్రగడ దరఖాస్తు చేయడం... ఆయనకు అనుమతి రావడంతో ముద్రగడ పద్మనాభరెడ్డిగా ఆయన పేరు మారనుంది. 2014 చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కాపులకు రిజర్వేషన్ల అంశంపై ముద్రగడ పెద్దఎత్తున ఉద్యమించారు.

ఇంటి ముంగిటకు కిరాణా సౌకర్యం తెచ్చిన అమేజాన్ ఫ్రెష్

విశాలాంధ్ర-రాయచోటి: పండ్లు, కూరగాయలు, చిల్డ్ ఉత్పత్తులు, సౌందర్యం, బేబీ, పర్సనల్ కేర్, పెట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వంటి తడి, పొడి కిరాణా సరుకులకు చెందిన ఫుల్-బాస్కెట్ కిరాణా సరుకుల సర్వీస్ అమేజాన్ ఫ్రెష్ 130 నగరాలకు విస్తరించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అమేజాన్ ఇండియా. అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్ పండ్లు, కూరగాయలను 11,000కి పైగా రైతుల నుంచి సేకరిస్తారన్నారు. '4-స్టెప్ నాణ్యతా తనిఖీ' ద్వారా ఉత్పత్తి నాణ్యతను నిర్ధారిస్తారన్నారు. అంబాలా, ఔరంగాబాద్, హోషియార్ పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130 నగరాల్లో కస్టమర్స్ గొప్ప ఆదాలు ఆనందిస్తార న్నారు. ఇతరులు తమ వారపు/నెలవారీ బాస్కెట్‌ను రూపొందిస్తున్నప్పుడు అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్, బ్యాంక్ భాగస్వాముల నుంచి ఉత్తేజభరితమైన డీల్స్ పొందుతారన్నారు. డైరెక్టర్, అమేజాన్ ఫ్రెషన్ ఇన్ అమేజాన్ ఫ్రెష్ శ్రీకాంత్ శ్రీరామ్ మాట్లాడుతూ భారతదేశంలో కిరాణా షాపింగ్‌ను పునః రూపుదిద్దుతోం దన్నారు. ఇంకా కస్టమర్స్ క్యాష్ బాక్, ఆఫర్స్, బ్యాంక్ డిస్కౌంట్స్ నుంచి ప్రయోజనాలు పొందవచ్చు, తమ ప్రతి కొనుగోలుకు విలువను చేరుస్తుందన్నారు. అమేజాన్ ఫ్రెష్ కిరాణా సరుకుల కోసం amazon.in పై ప్రత్యేకమైన యాప్-ఇన్-యాప్‌తో సులభమైన షాపింగ్ అనుభవాన్ని, తరచుగా షాపింగ్ చేసిన వస్తువులు చెక్ అవుట్ సమయంలో మర్చిపోకుండా వ్యక్తిగత విడ్ గెట్స్, బై గైన్ ఆప్షన్, రిమైండర్స్ వంటి సౌకర్యవంతమైన ఫీచర్స్ అందిస్తుందన్నారు. ప్రతి నెల 1 నుంచి 7 వరకు సూపర్ వేల్యూ డేస్‌తో కస్టమర్స్ తమ నెలవారీ బాస్కెట్‌ను విలువతో రూపొందించుకోవచ్చన్నారు.

సంపాదకీయం

జబ్బొకరికి మందు మరొకరికి

సావిత్రీ ఠాకూర్ కేంద్రంలో బాలల, మహిళా సంక్షేమ శాఖ మంత్రి. ఆమెకు బోర్డు మీద బేటీ బచావో ఔర్ బేటీ పఢావో అని రాయడమే రాలేదు. అలాంటి వారు మంత్రులుగా ఉన్నచోట విద్య సవ్యంగా ఉంటుందని, పరీక్షల నిర్వహణ, వాటి ఫలితాల ప్రకటన సక్రమంగా ఉంటుందని ఆశించలేం. వైద్య విద్యలో చేరాలనుకునే వారికి జాతీయస్థాయిలో నిర్వహించిన "నీట్" (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షలో గందరగోళం జరిగిందని ఆందోళనలు జరుగుతున్న సమయంలో కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా చేరగోరే వారికి నిర్వహించిన "నెట్" (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పరీక్షకు పదకొండు లక్షల మంది హాజరయ్యారు. పరీక్ష మంగళవారం జరిగితే గురువారం ఈ పరీక్షను రద్దు చేశారు. అదేమంటే ఈ పరీక్షలో గందరగోళం జరిగిందని అందువల్ల ఆ పరీక్షలకు విశ్వసనీయత ఉండదని ఆ పరీక్షను రద్దుచేశామని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ రెండు పరీక్షలు జాతీయ స్థాయిలోనే జరుగుతాయి. నెట్ పరీక్షను విశ్వవిద్యాలయ నిధుల సంఘం నిర్వహిస్తుంది. నెట్ పరీక్ష గత 18వ తేదీన 317 నగరాల్లో 1205 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. నెట్ పరీక్షలో విశ్వసనీయత లేదని సమాచారం అందినందువల్లే పరీక్ష రద్దు చేశారట. పరీక్ష జరిగిన మర్నాడే జాతీయ సైబర్ నేరాల విశ్లేషణా విభాగం నుంచి పరీక్షలో అక్రమాలు జరిగాయన్న సమాచారం అందిందట. ఈ విభాగం అమిత్ షా హోం మంత్రిత్వశాఖ అధీనంలో పనిచేస్తుంది. దేశంలోకెల్లా అత్యంత శక్తిమంతుడని చెప్పుకునే అమిత్ షా కేంద్ర హోం మంత్రిగా ఉన్నారు. నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఉప్పందిన వెంటనే విద్యాశాఖ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. మళ్లీ ఈ పరీక్ష ఎప్పుడు జరిగేది పరీక్ష రాసే వారికి తెలియజేస్తారట. ఈ పరీక్షలో అవకతవకలను విచారించే బాధ్యతను కేంద్ర దర్యాప్తు సంఘం (సీబీఐ)కు అప్పగించారు. సీబీఐ కూడా అమిత్ షా నేతృత్వంలోనే పనిచేస్తుంది. నెట్, నీట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అనే వ్యవస్థ నిర్వహిస్తుంది. నీట్ పరీక్షా ఫలితాలు గత నాలుగో తేదీన వెల్లడైనాయి. ఇందులో 67 మంది విద్యార్థులకు నూటికి నూరుశాతం మార్కులు వచ్చాయి. ఈ పరీక్షలో మొత్తం 720 మార్కులు ఉంటే 67 మందికి 720 మార్కులు వచ్చాయి. ఇది అనూహ్యం. మరి కొందరికి 719, 718 మార్కులు వచ్చాయట. ప్రస్తుత పరిస్థితిలో ఇన్ని మార్కులు రావడం అసాధ్యమట. ఇంకా వైపరీత్యం ఏమిటంటే హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి నూటికి నూరుశాతం మార్కులు రావడం. ఈ కారణంగానే పరీక్షా పత్రాలు పరీక్షకు ముందే బయటకు వచ్చాయన్న వార్త వచ్చింది. పరీక్ష రాసిన విద్యార్థులు వీధులకెక్కారు. ఈ అంశం సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. అయితే సుప్రీంకోర్టు ఈ ఫలితాలను నిలిపివేయడమో లేదా మొత్తం పరీక్షనే రద్దు చేయడమో చేయకుండా కౌన్సిలింగ్ కొనసాగడానికి అనుమతించింది. అనేక సందర్భాలలో అత్యున్నత న్యాయస్థానం తీర్పులు వరదెత్తిపోయిన తరవాత అడ్డుకట్ట నిర్మించినట్టు ఉండడం అనుభవంలో ఉన్నదే. నీట్ పరీక్షలో అనూహ్యంగా కొందరికి నూటికి నూరు శాతం మార్కులు రావడానికి పరీక్షా పత్రం సులభంగా ఉండడమే కారణమని ఎన్.టి.ఎ. అంటోంది. ఒక ప్రశ్నే తప్పుగా ఉండడం, కొంతమందికి సరైన సమయం చిక్కకపోవడం, సిబ్బంది చేసిన పొరపాట్లవల్ల అయిదేసి గ్రేస్ మార్కులు ఇచ్చారట. 720 మార్కులకు 720 మార్కులు రావడానికి గ్రేస్ మార్కులు కూడా కారణం అయి ఉండవచ్చునంటున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే 1563 మంది విద్యార్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తరవాత ఉపసంహరించారట. ఇది మరీ విచిత్రం. గ్రేస్ మార్కులు ఇచ్చినప్పుడు పనిచేసిన విచక్షణకు కారణం ఏమిటో అంతుపట్టదు. నీట్ పరీక్షకు సంబంధించి బీహార్, గోద్రాలో పరీక్షాపత్రాలు పరీక్షకు ముందే వెల్లడైనాయన్న ఆరోపణలను ప్రభుత్వం అంగీకరించడంలేదు. ఈ ఆరోపణలు రుజువు అయితే అందుకు బాధ్యులైన వారిమీద చర్య తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉదారంగా ఓ హామీ పడేశారు.

ఈ ప్రభుత్వం పేపర్ లీకుల ప్రభుత్వంగా మారిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో అయితే పరీక్షకు ముందే ప్రశ్న పత్రం బయటకు వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణలు వచ్చిన అన్ని రాష్ట్రాలలోనూ బీజేపీనే అధికారంలో ఉండడం విశేషం. కోటాలో నీట్ పరీక్షకు సిద్ధం అవుతున్న ఓ విద్యార్థి చెప్పిన వివరాలు పరీక్షలో ఎన్ని లొసుగులు ఉన్నాయో వివరాణాత్మకంగా తెలియజేస్తోంది. ఆ విద్యార్థి కథనం హృద్యంగా కూడా ఉంది. తాను కోటాలో శిక్షణ పొందుతుండగా తన దగ్గరి బంధువు ఫోన్‌చేసి పరీక్ష మన జేబులో ఉన్నట్టే ఇక నువ్వు తిరిగి వచ్చేయి అన్నాడట. ఆయన ఆ విద్యార్థిని మరో ఇద్దరు విద్యార్థుల దగ్గరకు తీసుకెళ్లారట. వారు ఈ విద్యార్థికి పరీక్షా పత్రంతో పాటు వాటికి సమాధానాలు కూడా అందజేసి బట్టీ పట్టమన్నారట. తెల్లవార్లు బట్టీ పట్టిన ఆ విద్యార్థి పరీక్షకు వెళ్తే అచ్చు గుద్దినట్టు అవే ప్రశ్నలు వచ్చాయట. పరీక్షా పత్రాలు ముందే బయటకు వచ్చాయనడానికి ఇంతకన్నా పెద్ద రుజువులు అక్కర్లేదుగా! అయితే పరీక్షరాసి బయటకు రాగానే ఆ విద్యార్థిని అరెస్టు చేశారు. పరీక్షా పత్రాలు ముందే బయట పడ్డందువల్ల వివిధ రాజకీయ పక్షాలకు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ శుక్రవారం దేశవ్యాప్త నిరసనకు పిలుపు ఇచ్చింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకెక్కితే పరీక్ష రాయడానికి తగినంత సమయం దక్కని 1563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎన్.టి.ఎ.ను ఆదేశించింది. మిగతా ఆరోపణల విషయంలో మాత్రం సుప్రీంకోర్టు ఎన్.టి.ఎ.కు నోటీసు జారీచేసి ఊరుకుంది. ఒక్కొక్క నీట్ ప్రశ్నాపత్రం 30 నుంచి 32 లక్షలు పలికిందట. అవినీతి, అక్రమాలు రాజకీయాలకు లేదా కొన్ని విభాగాలకు పరిమితమైన వ్యవహారంకాదు. అది సర్వాంతర్యామి. పరీక్షల నిర్వహణలో ఇంతలేసి అక్రమాలు జరగడం అంటే భావితరాల భవిష్యత్తుతో ఆటలాడుకోవడమే. ఈ వ్యవహారం బయటికి రాకుండా ఉంటే వారు వైద్య విద్య అభ్యసించడమే కాక వైద్యుల అవతారమెత్తి కత్తులు, కటార్లు పట్టుకుని రోగుల ప్రాణాలతో చెలగాటమాడుకోవడానికి అవకాశం ఇచ్చినట్టేగా! పాఠ్య గ్రంథాలను తమకు అనువుగా మార్చడం మీద బీజేపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ మెరుగైన విద్య అందించడం మీద, సక్రమంగా పరీక్షలు నిర్వహించడంమీద లేదు. అడ్డగోలుదారుల్లో అధికారం సంపాదించే వారి నుంచి మంచి నడవడిక ఆశించడం పేరాశే.

నేను మారాను- నేను విన్నాను

రా బావ ఏంటి నేను మారాను అంటూ వస్తున్నావు. అవును యథారాజా తథాప్రజా అన్నారు. రాష్ట్రాన్ని పాలించె ముఖ్యమంత్రి మారితె తదనుగుణంగా ప్రజలంతా మారాలి కదా. అందుకె నేను మారాను అంటున్నా. ఆయన పరిపాలన విషయంలోనె మారాను అంటున్నాడు. మొన్న క్యాబినెట్ మంత్రివర్గ కూర్పు అందుకు నిదర్శనం. అన్ని సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకుని పార్టీలో బుచ్చయ్య చౌదరి లాంటి వారిని సైతం దూరంపెట్టి మార్పు ప్రజలకు అర్థమయ్యేలా చూపాడు. సరె ఈ మార్పు అయిదేళ్లు నిలవాలి కదా. ఎన్నికల మానిఫెస్టో అమలు చెయ్యాలి. పెన్షను పెంపు, స్త్రీలకు ఉచిత బస్సు లాంటి వన్ని అమలు చెయ్యాలి. నిజమె ఖచ్చితంగా చేస్తాడు. ఎందుకంటే ఒక రకంగా చంద్రబాబును అదృష్టం వరించింది. అదేమిటంటే బీజేపీకి పూర్తి మెజారిటీరాక బాబుపైన ఆధారపడటం. గతంలో జగన్ అవసరం బీజేపీకి లేదు. అయినా సొమ్ముల కోసం మోదీని అంటకాగవలసి వచ్చింది. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నం. మోదీయే బాబుపై ఆధారపడవలసి వచ్చింది. నిజమె ప్రస్తుతం రాష్ట్ర అవసరాల కోసం జగన్ బతిమాలితె ఇప్పుడు బాబు డిమాండ్ చేయవచ్చు. అందుకె ప్రత్యేక హోదా డిమాండుకు యిది సరైన సమయం. గతంలో ప్యాకేజి అడిగిన చంద్రబాబు ఈసారైనా హోదా

కోసం డిమాండు చేయాలని రాజకీయ విశ్లేషకులు కోరుతున్నారు. రాజకీయ మేధావిగా చంద్రబాబు గణుతికెక్కారు. ఆ మేధావితనం ఉపయోగించి హోదా సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ఆయన వారసుడుకు, భవిష్యత్తుకు ఢోకా ఉండదు. బాబు తెలివిగలవాడు కనుక ఈ అయిదేళ్లు నిర్విరామ కృషితో అభివృద్ధిచేసి కుమారునికి పూలబాట ఏర్పాటు చేయవచ్చు. వచ్చే 2029 ఎన్నికల నాటికి 80 ఏళ్ల వయసులో తిరగలేకపోయినా ఈ అయిదేళ్ల అభివృద్ధి మరల అందలం ఎక్కించగలదు. ఆ విధంగా తనయునికి పూలబాట ఏర్పాటుచేసి విశ్రాంతి తీసుకోవచ్చు. వీటన్నింటికి మూలం ఈ అయిదేళ్ల అభివృద్ధే అనే సంగతి చంద్రబాబుకు బాగా తెలుసు. నిజమె బావ కొడుకు భవిష్యత్తు కోసమైనా అభివృద్ధి చేస్తాడనే నమ్మకం నాకుంది. అది సరె ముఖ్యమంత్రుల స్లోగన్లు గమ్మత్తుగా ఉన్నాయి. నేను వున్నాను విన్నాను అని జగన్ అంటె నేను మారాను నన్ను నమ్మండి అని చంద్రబాబు అంటున్నారు. ఏది ఏమైనా ప్రజలు తెలివిగ ఆలోచించి ఓటు వేస్తున్నారు. జగన్‌కు ముందు చంద్రబాబు పాలన నచ్చక జగన్‌కు ఓటు వేశారు. ప్రస్తుతం నేను మారాను అన్న బాబును, ఆయన మానిఫెస్టో నమ్మి బాబుకు ఓటు వేశారు. గతంలో కంటె ప్రజలు బాగా ఆలోచిస్తున్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్న రోజుల్లో ఉన్నవాడు, లేనివాడు అని రెండు వర్గాలుగా సమాజాన్ని విభజించారు. లేనివాళ్ల కోసం కమ్యూనిస్టులు పాటుబడ్డారనేది నిర్వివాదాంశం. కాని ప్రస్తుతం సమాజాన్ని అనేక వర్గాలుగా విభజించారు. సమాజ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ఓటర్లు ఆలోచించడం మానివేశారు. ప్రతివాడు నాకేంటి, నాకేం చేసింది ఈ ప్రభుత్వం అని మాత్రమే ఆలోచిస్తున్నాడు. ఈ స్వార్థం బలపడుతున్న కొద్ది వర్గ దృక్పథం పెరుగుతూ వస్తోంది. ఒక వర్గానికి ప్రభుత్వం మేలు చేస్తె మిగతా వర్గాలకు కోపం. ప్రస్తుతం జగన్ చేసిన తప్పు అదేననిపిస్తోంది. అభివృద్ధిని పక్కనపెట్టి పేదల గురించి మాత్రమె ఆలోచించాడు. దాంతో మిగతా వర్గాలన్నీ దూరమయ్యాయి. అటెండరు దగ్గర నుంచి ఐఎఎస్ వరకు, టీచర్లు, పోలీసులతో పాటు అందరు జగన్‌కు దూరమయినట్లు ఎన్నికల ఫలితాలు చెప్పకనె చెప్పాయి. రెండు కోట్ల ప్రజలకు మంచి చేశానని ఎందుకు ఓటేయలేదని జగన్ బాధపడ్డాడు. దానిపై ఒక ఉద్యోగి స్పందిస్తూ అది నిజమె కాని యింకా మూడు కోట్ల జనాభా వ్యతిరేకించారని వ్యాఖ్యానించాడు. పథకాలు పొందిన కుటుంబాలలో కూడ స్త్రీలు వేసినా పురుషులు వేయలేదని అక్కడక్కడా వినిపిస్తోంది. అందుకు కారణం నిత్యావసర వస్తువుల ధరలతో పాటు రోజంతా కష్టపడి కష్టాన్ని మర్చిపోవడానికి తీసుకునే లిక్కరు 50 రూపాయల నుండి 200 వరకు పెరగడంతో పథకాలందుకున్న కుటుంబాలలో కూడ మగవారు వేయలేదనె వినిపిస్తోంది. ఏది ఏమైనా సంక్షేమం అభివృద్ధి సమతూకంగా ఉంటేనె అందరి మన్ననలు పొందగలడు. లక్షల జీతం తీసుకునేవారైనా సరె వారికి రావలసిన బకాయిలు చెల్లించకపోతె నిరసన తప్పదనె విషయం కూడ తేటతెల్లమయింది. అందుకె వర్గ విభజనతో ఉన్న సమాజంలో అన్ని వర్గాల వారి గురించి ఆలోచించి అందరిని తృప్తిపరచకపోతె స్వార్థంతో నిండిన ఈ సమాజంలో జరిగేది యిలాగె ఉంటుంది. ప్రతి మనిషి నాకేంటి అని కాక సమాజ శ్రేయస్సు ముఖ్యమని భావించే రోజు వచ్చే వరకు అన్ని వర్గాలను తృప్తి పరిస్తేనె నిలబడగలరు.

మద్దతు ధర పెంపునకు ధరల సూచీ లింక్ చేయాలి

డాక్టర్ సోమ మర్ల

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ మొదటి కేబినెట్ సమావేశంలో 14 పంటలకు కొత్త మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించింది. పెంపు చాలా తక్కువగా, 5 నుంచి 7 శాతం మధ్య ఉంది. అవిశెలు, రాగి మినహా మిగిలిన పంటల పెరిగిన మద్దతుధర సాగు వ్యయాన్ని ప్రతిబింబించడం లేదు. ఉదాహరణకు వరి ధర క్వింటాల్‌కు కేవలం రూ.550 మాత్రమే పెరిగింది. ప్రధాన ఖరీఫ్ పంట అయిన వరి కనీస మద్దతు ధర 2023లో రూ. 2,183 నుంచి 2024లో క్వింటాల్‌కు రూ. 2,300కి అంటే రూ.117 మాత్రమే పెరిగింది. అంటే పెంపు కేవలం 5.3శాతం మాత్రమే. మరో పంట కందులు రిటైల్ కిరాణా దుకాణాల్లో కిలో రూ.240కి విక్రయిస్తున్నారు, కొత్త మద్దతుధర ప్రకారం రైతులకు కిలోకు రూ.75 (కేవలం 7.3శాతం) మాత్రమే పెరుగుదల నమోదైంది. నూనె గింజల పంట అవిశెలు, రాగుల కనీస మద్దతు ధర వరుసగా 12.7శాతం,

పంట	కొత్త మద్దతు ధర (రూపాయల్లో)	గత సంవత్సరంతో పోలిస్తే పెరుగుదల
వరి	2,300	5.3%
కందులు	7,550	7.5%
పత్తి	7,121	7.5%
వేరుశనగ	6,783	6.4%
రాగులు	4,290	11.5%
అవిశెలు	8,717	12.7%

11.5శాతం నమోదైంది.

స్వావలంబనను ప్రోత్సహించడానికి పప్పుధాన్యాలు, నూనె గింజలకు మద్దతుధర పెరుగుదల గురించి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, వాస్తవానికి అవిశెలు మినహా అన్ని పంటల్లో కనీస మద్దతు ధర చాలా తక్కువగా ఉంది. కొత్త మద్దతు ధరలు సాగు ఖర్చులకు కూడా సరిపోవడంలేదు. 2022-2023 వినియోగంలో దిగుమతులు దాదాపు 14శాతం కాగా, దీనిలో 2.53 మిలియన్ టన్నుల పప్పుధాన్యాలు 46.5 లక్షల టన్నులు ఉన్నాయి. దాదాపు 3.74 బిలియను డాలర్లు (2022లో 1.94 బిలియన్ డాలర్లు) చెల్లించాం. నూనె గింజల్లో కూడా వినియోగంలో 28 శాతం కొరత



ఉంది. ప్రభుత్వం 18.0 బిలియన్ డాలర్లు చెల్లించి 120 లక్షల టన్నుల ఆయిల్ పామ్, సన్‌ఫ్లవర్, ఇతర నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ఉక్రెయిన్, రష్యాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఈ సంవత్సరం బిల్లు 20.0 బిలియన్ డాలర్లు కానుంది. దిగుమతులపై భారీ వ్యయంచేసే బదులు, ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటలకు సరైన మద్దతు ధరలను అందించడం ద్వారా మన ప్రభుత్వం కేవలం సగం మొత్తాన్ని రైతులకు చెల్లించవచ్చు. చాలా వరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు పేద, చిన్న రైతులు వర్షాధార పరిస్థితులలో సాగుచేస్తారు కాబట్టి ధరల పెరుగుదల కష్టాలనుంచి వారికి ఉపశమనం కలిగిస్తుంది.

పెరిగిన సాగు ఖర్చులు

ఉత్పత్తి వ్యయంలో 50శాతం అదనంగా చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది పచ్చి అబద్ధం. 2014-24 మధ్యకాలంలో డీఏపీ, డీజిల్,

పత్తి విత్తనాలు, రవాణా ఛార్జీలు వంటి ఇన్‌పుట్‌ల ధరలు మూడు రెట్లు పెరిగాయి. అయినప్పటికీ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ సీపీసీఏ, ఎంఎస్‌పీల గణనలో సాగుఖర్చు కోసం 2011-12ని ఆధార సంవత్సరంగా పరిగణిస్తోంది. బదులుగా, ప్రస్తుత సీజన్‌లో కనీస మద్దతుధర (ఎంఎస్‌పీ)ని లెక్కించడానికి ప్రభుత్వం గత సంవత్సరం ఇన్‌పుట్ ఖర్చులను ప్రాతిపదికగా పరిగణించాలి. అంతేకాకుండా, కుటుంబ శ్రమ భాగం చాలా లోపభూయిష్టంగా ఉంది. 2.4 ఎకరాల కౌలు, చిన్న రైతులు 84శాతం మంది వున్నారు. వారి కుటుంబాలు తెల్లవారడంతోనే పొలాల్లో శ్రమిస్తాయి. సాగు ఖర్చులలో 30శాతం వరకు శ్రమచేస్తారు. కానీ దీనికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.125 మాత్రమే చెల్లించింది. వాస్తవానికి పంట సీజన్‌లో వరి ఉత్పత్తి క్వింటాల్‌కు కుటుంబ కార్మికుల శ్రమ భాగం దాదాపు రూ.700 అవుతుంది.

కొత్త ఎంఎస్‌పీలను శాస్త్రీయంగా (జ2 +50) గణించాలి, మునుపటి సీజన్ సాగు ఖర్చులను ప్రాతిపదికగా తీసుకోవాలి.

పంట కనీస మద్దతుధరలు పెంపును టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ-హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్)కి అనుసంధానం చేయాలి.

ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు వంటి ఇన్‌పుట్‌లపై జీఎస్టీని తీసివేయాలి.

ఎరువులు, డీజిల్, క్రిమిసంహారకాల ధరలపై పరిమితి విధించాలి.

మార్కెట్లలో ప్రకటించిన కనీస మద్దతుధరల హామీ చెల్లింపుకోసం చట్టాన్ని తీసుకురావాలి. ఇటీవలి ఎన్నికల్లో రైతుల క్రోధానికి గురై పరాజయం పాలైనా కూడా బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం గుణపాఠం నేర్చుకోలేదు.

ధృతరాష్ట్ర కౌగిలిలో బాబు, నితీశ్

ఎం.సి.వెంకటేశ్వర్లు

పార్లమెంటు సీట్లు 400కుపైగా సాధించి మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తానని ప్రచారం చేసుకున్న మోదీ భంగపడక తప్పలేదు. అయినా ప్రధానిగా ప్రమాణస్వీకారంచేసి, నెహ్రూ రికార్డుని సమం చేయాలన్న ఆకాంక్షను నెరవేర్చుకున్నాడు. గతంలో మోదీ చేతిలో అవమానాలకు గురైన ఏ.పీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, మోదీ ఆలింగనాలతో తరించిపోయి ఆయన ఆకాంక్షను నెరవేర్చారు. కాని చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని కాపాడు కోవడానికి మోదీతో స్నేహం తాత్కాలికంగా ప్రయోజనం చేకూర్చవచ్చు. కానీ వారిద్దరు ధృతరాష్ట్ర కౌగిలిలో బందీలైన విషయం గమనార్హం.

బాబు, నితీశ్ అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రులు. ప్రత్యేకించి బాబు, వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్‌డీఏ కన్వీనర్‌గా ఉండడమేగాక, దేశ రాజకీయ, ఆర్థిక లక్ష్యాలపై స్పష్టమైన దృక్పథం కలిగిన వ్యక్తి. అయినప్పటికీ వారికున్న అనుభవాలను, ప్రతిష్ఠను, ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి మోదీకి భజన చేయటలో బీజేపీ భజంత్రీలను మించిపోయారు.

ఈ నెల 7వ తేదీన పాత పార్లమెంటు భవనంలో జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటు సమావేశంలో చంద్రబాబునాయుడు తమ నాయకుడుగా మోదీని బలపరుస్తూ దేశ ప్రధానిగా నరేంద్రమోదీ పేరును గర్వంగా సమర్థిస్తున్నాను...మానవతావాదం తప్ప తనకు మరోవాదం తెలియదని ఎన్‌టీఆర్ చెప్పారని, దానిని మోదీ ఇప్పుడు సాకారం చేస్తున్నాడ"ని చెప్పి తెలుగు ప్రజలను సిగ్గుతో తలవంచుకునేట్లు చేశాడు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మరొక అడుగు ముందుకువేసి మోదీ 10 సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధి అద్భుతమని, ప్రణాళికా బద్ధంగా ఉందని చెప్పడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. మోదీ సైతం తన పాలనలో జరిగిన అభివృద్ధిని, గత ఎన్నికల హామీల అమలు గూర్చి ఎన్నికల సభలో చెప్పుకునే ధైర్యం చేయలేదు. కాని నితీశ్‌కుమార్ మాత్రం మోదీ ప్రణాళికాబద్ధ అభివృద్ధి గురించి చెప్పడం శోచనీయం.

నిజానికి మోదీ మానవతావాదా? అయితే 2002 గోద్రా ఘటనల అనంతరం ప్రపంచ దేశాలు మోదీకి వీసా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించాయి? గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో సంఘపరివార్ ముస్లింలను ఊచకోతకోసినా కనీసం విచారం కూడా ప్రకటించకుండా నిరాకరించిన మోదీ మానవతావాది అని చెప్పడం రాజకీయ అవకాశం కాదా? పైపెచ్చు మోదీని ఎన్‌టీఆర్‌తో పోల్చడం ఎన్‌టీఆర్‌కు అవమానం కాదా? ఆనాడు ప్రధానిగా ఉన్న వాజపేయి, శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న వేలమంది నిరాశ్రయులను చూసి చలించిపోయి పాలకులు రాజధర్మాన్ని

పాటించాలని హితవు పలికినా తలకెక్కించుకోని మోదీ ఎంత కర్కశ హృదయుడో 140 కోట్లమంది ప్రజలకు అర్థమైంది.

వ్యక్తిగతంగా తాను, తను నేతృత్వం వహిస్తున్న బీజేపీ అధికారంలో శాశ్వతంగా తిష్టవేయడానికి ప్రధాని మోదీ ఎంచుకున్న మార్గం నిరంకుశపాలన, ప్రతిపక్షపార్టీల నిర్వీర్యం, "ఒకే దేశం, ఒకే ఎన్నికలు" పేరుతో జమిలి ఎన్నికలు జరిపించడానికి రాజ్యాంగాన్ని మార్చడం, కార్పొరేట్ వర్గాల మద్దతుతో పాలన సాగించడం మోదీ 10 సంవత్సరాల పాలనే ప్రత్యక్ష సాక్ష్యం. 2014లో అధికారంలోకి రావడంతోనే 'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదాన్నిచ్చాడు. అలీనోద్యమ నిర్మాతగా ప్రపంచఖ్యాతి వహించిన, నవభారత నిర్మాతగా దేశప్రజలు గుర్తించిన దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను, ఆయన కుటుంబాన్ని దేశానికి ప్రథమ శత్రువులుగా చిత్రించి ప్రజలను నమ్మించడానికి విఫలప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలలో సాధించలేని అభివృద్ధిని 70నెలల్లో తానుసాధించినట్లు, ప్రపంచం మొత్తం తనవైపే చూస్తున్నట్లు అసత్య ప్రకటనలను మోదీ నిత్యం వల్లిస్తుంటే దశాబ్దాలుగా ముఖ్యమంత్రులుగా చేసిన బాబు, నితీశ్ మోదీకి భజన చేయడం ఏపీ, బీహార్ రాష్ట్ర ప్రజలకే అవమానకరం.

భారతదేశం జీడీపీలో బ్రిటన్‌ను అధిగమించి నాలుగవ స్థానంలో చేరినా, త్వరలోనే మూడవ స్థానానికి చేరుతుందన్నా, ఆసియాలోనే శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తించినా దానికి మోదీ కారకుడని చెప్పుకోవడం హాస్యాస్పదం. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ యూనియన్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో ప్రభుత్వరంగాన్ని ఏర్పాటుచేయడం, సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం, ఆటమిక్ కేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్యాంకులు ఏర్పాటు భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయనడం జగమెరిగిన సత్యం. 1990 సంవత్సరంలో దేశం సంక్షోభంలో ఉన్న సమయంలో మన్‌మోహన్‌సింగ్ 1991లో ఆర్థిక మంత్రిగా నూతన సంస్కరణలు అమలు జరిపి దేశాన్ని ముందుకు తీసుకుపోయారు. ప్రధానిగా ఉన్న వాజపేయి హయాంలో రోడ్లు, రహదారులు, ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు తదితర మౌలిక వసతుల నిర్మాణంపై కేంద్రీకరించారు. వాటినే నేడు 10 సంవత్సరాలుగా మోదీ కొనసాగిస్తున్నాడు తప్ప కొత్తగా చేసింది శూన్యం.

ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల శిబిరంలో ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్ మాట్లాడుతూ "నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు. నేనే చేశానని చెప్పుకోడు. ప్రజాజీవితంలో మర్యాద పాటిస్తాడు అని చెప్పాడు. ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక "ఆర్గనైజర్" బీజేపీ ఎన్నికల వైఫల్యాలపై ఘాటుగా స్పందిస్తూ, మోదీ వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శించింది. ఇవి కమ్యూనిస్టులో, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శలైతే కొంతమేర ఆలోచించాలి. కానీ బీజేపీ మాతృసంస్థ, రిమోట్‌గా వ్యవహరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్, ఆ సంస్థ పత్రిక ఆర్గనైజర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడమంటే మోదీ అహం, నిరంకుశ విధానాలు ఏ స్థాయికి చేరాయో అర్థమవుతుంది. కనీసం ఆపాటి ఆలోచన కూడా బాబు, నితీశ్‌కు లేకపోవడం ఆశ్చర్యం కలుగుతుంది.

మోదీ ఏనాడు రాజ్యాంగాన్ని, ఫెడరలిజాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన దాఖలాలు లేవు. రాజ్యాంగబద్ధ సంస్థలను జేబు సంస్థలుగా మార్చి ప్రతిపక్ష పార్టీలను, నాయకులను వేధించడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంతసోరేన్‌ను అవినీతిపరులుగా ముద్రవేసి జైల్లో పెట్టారు. అదే మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్, అశోక్‌చవాన్‌లాంటి 25 మందికిపైగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా మోదీకి, బీజేపీకి వారు ఆప్తులు కనుక చర్యలు శూన్యం. మోదీ మిత్రుడు అదానీపై అనేక ఆరోపణలున్నా మోదీ అభిమానం ఏ మాత్రం తగ్గలేదు. మోదీపై విమర్శలుచేసే రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులు జైళ్లలో కుక్కబడ్డారు. భీమాకోరేగావ్ కేసుపై ఇంతవరకు ఎలాంటి విచారణ లేకున్నా "ఉపా" చట్టం కింద సంవత్సరాలుగా అనేకమంది జైళ్లలో మగ్గుతున్నా వీటన్నింటిని కళ్లున్నా బాబు, నితీశ్ చూడ నిరాకరించడం బాధాకరం.

చంద్రబాబు సైతం మోదీ దాడుల బాధితుడే! 2018లో బాబు ఎన్‌డీఏతో తెగతెంపులు చేసుకున్నప్పుడు "ఈడీ" రైడ్ చేసింది. ఆ సందర్భంలో "నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారు ఈడీ, ఐటీ దాడులను ఎదుర్కోవలసిందే. మేము ఈ చర్యలకు భయపడం. న్యాయం జరిగేంతవరకు మేము పోరాడుతాం. నేను 5 కోట్లమంది తెలుగు ప్రజల తరఫున మాట్లాడుతున్నాను" అని ప్రకటించాడు. కాని ఆ ధైర్యం, తెగింపు ఈనాడు ఏమైనట్లు? జగన్ అరెస్టు చేయించడంతోనే బాబు నీరసించి పోయాడా?

కాని 2024 మేలో జరిగిన శాసనసభ ఎన్నికలకు ప్రత్యేకత ఉన్నదనడంలో సందేహంలేదు. జగన్ పాలనలో అవినీతి అక్రమాలు పతాకస్థాయికి మించిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు పోలీస్ యంత్రాంగం, జగన్ తాబేదారులైన మాట నిజం. రాజధాని లేదు, రాష్ట్రం అప్పులపాలైంది. ఈ పరిస్థితులను చక్కదిద్దుకోడానికి, ఎన్నికల సందర్భంలో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని అదుపులో పెట్టుకోవడానికి కేంద్రం సహాయ సహకారాలు అవసరం అనే దానిలో కూడా సందేహంలేదు. కాని గత అనుభవం చూసినా, మోదీ వ్యక్తిత్వం చూసినా, బాబు ఆశలు నెరవేరడం పరిమితంగా ఉంటాయనడం వాస్తవం. అటువంటప్పుడు బాబు లౌక్యంగా ఉండాలి తప్ప జీ హుజూర్ అంటూ భజంత్రిగా మారితే, ఆంధ్రప్రదేశ్ మరోసారి దగాపడటం ఖాయం.

సెల్: 8121223457

ఇది పేపర్ లీక్ ప్రభుత్వం

- అవకతవకలు లేకుండా ఒక్క పరీక్షా నిర్వహించలేదు
- మోదీ సర్కార్‌పై ఖర్గే మండిపాటు
- యువత హక్కుల కోసం పోరాడతామని స్పష్టీకరణ

న్యూఢిల్లీ : యూజీసీ-నెట్ పరీక్ష రద్దు తర్వాత కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ గురువారం విరుచుకుపడింది. ప్రతి సంవత్సరం ఆయన 'పరీక్షా పే చర్చ' అని పిలిచే 'గొప్ప తమాషా' నిర్వహిస్తారని, అయినప్పటికీ ఆయన ప్రభుత్వం 'లీక్‌లు... అవకతవకలు' లేకుండా ఇప్పటి వరకు ఒక పరీక్షను కూడా నిర్వహించలేదని విమర్శించింది. ప్రతిపక్ష పార్టీ ప్రధాన మంత్రిని 'మాట్లాడటాన్ని కూడా లీక్ చేస్తారా' అని ప్రశ్నించింది. ప్రతి రోజు ప్రశ్నా పత్రం లీక్ అవుతుందని, ఇది ఎలాంటి 'పరీక్ష పే చర్చ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. 'మోదీ ప్రభుత్వం దేశ విద్య, నియామక వ్యవస్థను ఎలా నాశనం చేసిందో నీట్, యూజీసీ-నెట్, సీయూఈటీ (ఉమ్మడి అర్హత ప్రవేశ పరీక్ష) లో పేపర్ లీక్‌లు, మోసం, స్థూల అవకతవకలు ఇప్పుడు బట్టబయలయ్యాయి. చాలా ప్రచారం పొందిన ఎన్ఆర్ఏ (నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ) పూర్తిగా పనికిరాకుండా పోయింది' అని ఖర్గే హిందీలో 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 2020 ఆగస్టులో మోదీ ఎన్ఆర్ఏను ఎంతో ఆర్భాటంగా ప్రకటించారని ఆయన చెప్పారు. 'ఎన్ఆర్ఏ కోట్లాది మంది యువతకు ఒక వరంగా నిలుస్తుంది. ఉమ్మడి అర్హత ప్రవేశ పరీక్ష ద్వారా ఇది బహుళ పరీక్షలను తొలగిస్తుంది. విలువైన సమయాన్ని అలాగే వనరులను ఆదా చేస్తుంది. ఇది కూడా పారదర్శకతకు పెద్ద ఊపునిస్తుందని విపరీతమైన ప్రచారం చేశారు' అని ఖర్గే అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎన్ఆర్ఏ అన్ని ఉద్యోగాలకు ఒకే నియామక పరీక్షను నిర్వహిస్తుందని మోదీ ప్రభుత్వం పేర్కొందని, నాలుగేళ్లు గడిచినా జాతీయ నియామక సంస్థ (ఎన్ఆర్ఏ) ఇంకా ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. ఎన్ఆర్ఏకు మూడేళ్లపాటు రూ.1,517.57 కోట్ల నిధులు అందించగా, 2022 డిసెంబరు వరకు రూ.20 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంటులో సమాధానాలు కోరినప్పుడల్లా మోదీ ప్రభుత్వం కాలయాపన చేస్తూనే ఉందని, సాకులు చెబుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'ఎన్ఆర్ఏ అనేది నియామక పరీక్షల కోసం ఏకైక సంస్థగా కాకుండా కింది స్థాయిలో అభ్యర్థులను పరీక్షించే సంస్థగా మార్చబడింది' అని తెలిపారు. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయకుండా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ యువత రిజర్వేషన్ హక్కును లాక్కోవడానికి మోదీ ప్రభుత్వం 'ప్రణాళికాబద్ధమైన కుట్ర' పన్నిందని ఖర్గే ఆరోపించారు. 'ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో శాస్త్రీయ ఆలోచనను ప్రోత్సహించే బదులు దానికి రాజకీయ రంగు పులుముతున్నారు. యూజీసీ, సీబీఎస్ఈ, ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థల స్వయం ప్రతిపత్తిని రద్దు చేశారు' అని విమర్శించారు. ఆర్టీఐ ప్రకారం, ఆరేళ్లలో ప్రధాని మోదీ 'పరీక్ష పే చర్చ'పై ఖర్చు 175 శాతం పెరిగిందని, రిగ్గింగ్ లేకుండా దేశవ్యాప్తంగా పరీక్షను నిర్వహించలేని ప్రభుత్వం 'పరీక్ష' సమయంలో విద్యార్థులపై జ్ఞాన వర్షం కురిపించడం మోసమని తెలిపారు. తప్పుడు వాగ్దానాలు చేస్తూ లక్షలాది మంది యువతను నిరుద్యోగుల ఊబిలోకి నెట్టిన మోదీ జీ బుధవారం కెమెరాల నీడలో విశ్వవిద్యాలయాల చుట్టూ తిరిగారు' అని అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ... 'పెహ్లీ నౌకరీ పక్కి (మొదటి ఉద్యోగం సురక్షితం)', 'రిజర్వేషన్ హక్కు', 'పేపర్ లీక్ నుంచి స్వేచ్ఛ' అనే అజెండాను కొనసాగిస్తుంది' అని ఖర్గే చెప్పారు. యువత హక్కుల కోసం మా పోరాటం వీధుల నుంచి పార్లమెంటు వరకు కొనసాగుతుందన్నారు. వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్' పై రగులుతున్న వివాదం మధ్య, పరీక్షల సమగ్రతకు భంగం వాటిల్లుతుందనే సమాచారం నేపథ్యంలో యూజీసీ-నెట్‌ను రద్దు చేస్తూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ బుధవారం ఆదేశించింది. ఈ విషయాన్ని దర్యాప్తు కోసం సీబీఐకి అప్పగించింది. యూజీసీ-నెట్ అనేది భారత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా, పీహెచ్‌డీలో ప్రవేశానికి, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డుకు భారతదేశ జాతీయుల అర్హతను నిర్ణయించడానికి ఒక పరీక్ష. పాట్నాలో జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (యూజీ) 2024 నిర్వహణలో అవకతవకలకు సంబంధించి మంత్రిత్వ శాఖ బీహార్ పోలీసు ఆర్థిక నేరాల విభాగం నుంచి నివేదికను కోరింది. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు జైరాం రమేశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రధాన మంత్రి 'పరీక్షా పే చర్చ' అని పిలిచే 'గొప్ప తమాషా' ను నిర్వహిస్తారని ఎద్దేవా చేశారు. 'అయినప్పటికీ అతని ప్రభుత్వం లీక్‌లు, మోసాలు లేకుండా పరీక్షను కూడా నిర్వహించదు' అని అన్నారు. నీట్-2024 పరీక్ష చాలా తీవ్రమైన ప్రశ్నలను ఎదుర్కొంటుందని, విద్యా మంత్రి కూడా అంగీకరించవలసి వచ్చిందని జైరాం రమేశ్ అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చిత్తశుద్ధిపై తీవ్ర అనుమానం ఉందని, ఇప్పుడు నిన్నటికి నిన్న నిర్వహించిన యూజీసీ-నెట్ బుధవారం రాత్రి రద్దయిందని చెప్పారు.

నిజానికి సీయూఈటీ (కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) ద్వారా 12వ తరగతి పరీక్షలను పూర్తిగా అపహాస్యం చేయడంతో ప్రభుత్వం భారతదేశ విద్యావ్యవస్థను నాశనం చేసిందని, ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, సీబీఎస్ఈల వృత్తి నైపుణ్యం ధ్వంసమైందని విమర్శించారు. 2020 కొత్త విద్యా విధానం, భారతదేశ విద్యా వ్యవస్థను భవిష్యత్ కోసం సిద్ధం చేయడం కంటే, నాగ్‌పూర్ విద్యా విధానం 2020గా మాత్రమే పని చేస్తుంది' అని ధ్వజమెత్తారు. 'ఇది మొత్తం రాజకీయ శాస్త్రంలో ఎంఏ వారసత్వం. అతను ఎప్పుడైనా 'మాట్లాడటాన్ని లీక్ చేస్తాడా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. యూజీసీ-నెట్‌ను రద్దు చేసిన వెంటనే, కాంగ్రెస్ బుధవారం మోదీ ప్రభుత్వం 'పేపర్ లీక్ ప్రభుత్వం' అని అభివర్ణించింది. ఇప్పుడు విద్యాశాఖ మంత్రి బాధ్యత తీసుకుంటారా అని ప్రశ్నించారు.

రాజ్‌భవన్‌లో నాకు భద్రత లేదు: గవర్నర్



కోల్‌కతా: రాజ్‌భవన్‌లో ప్రస్తుతమున్న పోలీసులతో తన భద్రతకు ముప్పు ఉందని గవర్నర్ సీవీ ఆనంద బోస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్‌ఛార్జి అధికారి, ఆయన బృందం వల్ల నా వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉంది. అలా అనడానికి నా దగ్గర ఆధారాలున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే నేను సీఎం మమతాబెనర్జీకి సమాచారం ఇచ్చాను. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు' అని బోస్ ఆందోళన వ్యక్తంచేశారు. తన అధికారిక నివాసంలో ఉన్న పోలీసు సిబ్బంది తనపై నిఘా ఉంచారంటూ ఇప్పటికే ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బయటి వ్యక్తుల ప్రభావం వల్ల వారు అలా చేస్తున్నారని గవర్నర్ భావిస్తున్నారు. ఇదిలాఉంటే... రెండురోజుల క్రితం రాజ్‌భవన్ పోలీసులపై గవర్నర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. వారు తక్షణమే అధికారిక నివాస పరిసరాలను విడిచివెళ్లిపోవాలని ఆదేశించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన దాడుల్లో గాయపడిన బాధితులతో కలిసి తనను కలిసేందుకు వచ్చిన అసెంబ్లీ విపక్ష (బీజేపీ) నేత సువేందు అధికారిని పోలీసులు అడ్డుకోవడమే అందుకు కారణమని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనిపై సువేందు కలకత్తా హైకోర్టుకు వెళ్లగా, అనుమతి ఉంటే గవర్నర్‌ను కలిసేందుకు వారిని రాజ్‌భవన్ లోపలికి పంపాల్సిందేనని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ వ్యవహారం తర్వాత పోలీసుల తీరుపై గవర్నర్ తీవ్రంగా మండిపడ్డారు. తన ఆదేశాలను వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది.

'వాల్మీకి' అవినీతిలో రెండో వికెట్ సిద్దరామయ్యే

ప్రతిపక్ష నేత అశోక్ ఆరోపణలు

బెంగళూరు: రాష్ట్రంలో ఏడాది పాలన ముగియగానే తొలి వికెట్‌గా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అవినీతిలో మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారని, ఇక రెండో వికెట్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యే అని ప్రతిపక్షనేత అశోక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యారెంటీలు అమలు చేయడంతో ఖజానా ఖాళీ అయిందన్నారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ, సిద్దరామయ్య, డీకే శివకుమార్ కాంగ్రెస్ నుంచి నిధులు ఇవ్వడం లేదన్నారు. ప్రజల నుంచి భారీగా పిండుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ద్విచక్రవాహనాన్ని శవం తరహాలో మోసుకెళ్లిన సిద్దరామయ్య ప్రస్తుతం ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 20 సీట్లు గెలుస్తామని ధీమాలో ఉండేవారని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు. ఏడాది పాలనలో అభివృద్ధికి ఒకరూపాయి కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. ముద్దెబిహాళ్ ఎమ్మెల్యే నాడగౌడ అభివృద్ధి పనులు కుంటుపడిన విషయాన్ని బహిరంగంగా చెప్పారన్నారు. నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులలోనూ అభివృద్ధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో బొమ్మై ముఖ్యమంత్రిగా పదవిని కోల్పోయినప్పుడు రెవెన్యూలోటు లేదని, అప్పులు లేవన్నారు. సిద్దరామయ్య ఏడాదిపాలనలో అప్పులు పెరిగాయని ఆర్థిక పరిస్థితి అధ్వానం చేశారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ పెంపుతో సామాన్యులపై భారం మోపారని మండిపడ్డారు.

'మాస్' మాజీ అధ్యక్షుడు జగ్గయ్య మృతి

చెన్నై: 'మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసి సంక్షేమ సంఘం' (మాస్) మాజీ అధ్యక్షుడు ఒ.జగ్గయ్య (80) గురువారం ఉదయం కన్నుమూశారు. స్థానిక ఆంజనేయనగర్ 2వ లేన్‌లోని స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. సాయంత్రం స్థానిక మూలకొత్తలం శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. జగ్గయ్య ఇన్‌కంట్యాక్స్‌లో సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం పదవీవిరమణ చేశారు. ఆ తరువాత అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మాస్ అధ్యక్షుడిగా, సలహాదారుగా క్రియాశీలకంగా వ్యవహరించారు. జగ్గయ్య మృతి పట్ల మాస్ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు, ఇతర నిర్వాహకులు, నగరంలోని వివిధ తెలుగు సంఘాలు తీవ్ర సంతాపం ప్రకటించాయి.

అబ్బాయిని అమ్మాయిగా మార్పించాడు!

వైద్యులతో ప్రేమోన్మాది కుమ్మక్కు

ముజఫర్‌నగర్ (ఉత్తరప్రదేశ్): తనకు నచ్చిన యువకుడిని పెళ్లి చేసుకోవడం కోసం ఏకంగా అతడికి లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించాడు ఓ ప్రేమోన్మాది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముజఫర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడికి (20)... ఓంప్రకాశ్ అనే వ్యక్తి రెండేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఇటీవల ఆ యువకుడు అనారోగ్యానికి గురవడంతో మెడికల్ చెకప్ చేయిస్తానంటూ ఓంప్రకాశ్ ఈనెల మూడో తేదీన మన్సూర్‌పూర్‌లోని బేగ్‌రాజ్‌పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ యువకుడిని పరీక్షించిన వైద్యులు చిన్న సర్జరీ చేయాలని సూచించారు. అనంతరం అతడికి మత్తుమందు ఇచ్చి లింగమార్పిడి శస్త్రచికిత్స చేశారు. వైద్యులతో చేతులుకలిపి ప్రకాశ్ ఈ తతంగమంతా నడిపినట్లు తెలిసింది. 'ఆసుపత్రికి తీసుకొచ్చిన మరుసటి రోజు నాకు ఆపరేషన్ చేశారు. స్పృహలోకి రాగానే నేను అమ్మాయిగా మారిపోయానని ఆ యువకుడు చెప్పారు. అప్పుడు ఓంప్రకాశ్ అక్కడికి వచ్చి తానే ఇదంతా చేయించానని చెప్పాడని అన్నాడు. ఇక నేను జీవితాంతం తనతోనే ఉండొచ్చని చెప్పాడు. పెళ్లి కోసం ఏర్పాట్లు కూడా చేశానన్నాడు. అందుకు అంగీకరించకపోతే నా తండ్రిని చంపేస్తానని బెదిరించాడు. మా భూమిని కూడా లాక్కొన్నాడు' అని బాధిత యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ఎలాగో ధైర్యం చేసి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో బాధితుడి తండ్రి ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఓంప్రకాశ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. భారతీయ కిసాన్ యూనియన్ సభ్యులు దీనిపై ఆందోళన చేపట్టారు. నిందితుడితో పాటు సర్జరీ చేసిన వైద్యులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనతో బాధిత యువకుడిపై శారీరకంగా, మానసికంగా తీవ్ర ప్రభావం పడిందని, ఇందుకుగానూ అతడికి రూ.రెండు కోట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ హయాంలో 'పరీక్షల రిగ్గింగ్'

అఖిలేశ్ యాదవ్ విమర్శ

లక్నో : యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గురువారం కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బీజేపీ పాలనలో పేపర్ మాఫియా 'పరీక్షలను రిగ్గింగ్' చేస్తోందని అన్నారు. పోలీసు నియామక పరీక్ష లీక్ అయితే, అది శాంతిభద్రతలపై ప్రభావం చూపుతుందని, నీట్ పరీక్షలో మోసం జరిగితే, నిజాయితీపరులు వైద్యులు కాలేరని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అలాగే యూజీసీ-నెట్ పరీక్ష రద్దు విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'బీజేపీ పాలనలో పేపర్ మాఫియా ప్రతి పరీక్షను ఒకదాని తర్వాత ఒకటి రిగ్గింగ్ చేస్తోంది. ఇది దేశంపై ఎవరైనా చేసిన పెద్ద కుట్ర కూడా కావచ్చు' అని అఖిలేశ్ 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'లోతైన విషయం అర్థం చేసుకోండి : పోలీసు నియామక పరీక్ష ప్రశ్నా పత్రం లీక్ అయితే శాంతిభద్రతలు మెరుగుపడవు, దాని వల్ల దేశంలోచ రాష్ట్రంలో అశాంతి, అస్థిరత ఉంటుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగితే, నిజాయితీపరులు వైద్యులు కాలేరు. భవిష్యత్తులో ప్రజలకు వైద్యం చేసే వైద్యుల కొరత మరింత పెరిగి, నిజాయితీ లేని వ్యక్తులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారతారు' అని తెలిపారు. 'యూజీసీ-నెట్ పరీక్ష జరగకపోతే, ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయుల కొరత మరింత పెరుగుతుంది. ఉపాధ్యాయుల కొరత దేశ మానసిక వికాసానికి ఆటంకం కలిగిస్తుంది. ఇది దీర్ఘకాలంలో దేశానికి చాలా ప్రాణాంతకంగా పరిణమిస్తుంది' అని అన్నారు. 'వీటన్నింటి వల్ల పరిపాలనతో పాటు ఆరోగ్యం, విద్యా వ్యవస్థ కూడా నాశనమైపోతుంది. ఇది మన దేశ పరిపాలన, మానవ వనరులకు వ్యతిరేకంగా చాలా పెద్ద కుట్ర కావచ్చు. చాలా విస్తృతమైన పరిణామాలను కలిగిస్తుంది' అని పేర్కొన్నారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో క్షుణ్ణంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఎన్నికల విరాళాల పేరుతో కోట్లాది రూపాయలను దోచుకునే అవినీతిపరులు, వారు పరీక్షా విధానాన్ని ఎలా తప్పించుకుంటారని ప్రజలు అంటున్నారు' అని తెలిపారు.

'కోటా' సమస్య పరిష్కరించాలి

కేంద్రానికి శరద్ పవార్ డిమాండ్

పూణె : కేంద్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించకుండా, మరాఠా సమాజం, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కోటా డిమాండ్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి నాయకత్వం వహించాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ గురువారం కోరారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలోని బారామతిలో కేంద్ర మాజీ మంత్రి విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రలో రిజర్వేషన్ల సమస్యపై పెరుగుతున్న మరాఠా-ఓబీసీ వివాదం గురించి అడిగిన ప్రశ్నకు, ఒక పరిష్కారం మాత్రమే ఉందని, చట్టం, రాష్ట్ర, కేంద్ర విధానాలలో సవరణలు అవసరమని అన్నారు. దానిని పరిష్కరించడానికి కేంద్రమే నాయకత్వం వహించాలని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరాఠా వర్గానికి ప్రత్యేక విభాగం కింద విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మహారాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే, ఓబీసీ గ్రూపు కింద కోటా ఇవ్వాలని సంఘం డిమాండ్ చేస్తోంది. కుంబీలను మరాఠా సమాజ సభ్యుల 'సేజ్ సోయారే' (రక్త బంధువులు) గా గుర్తించే ముసాయిదా నోటిఫికేషన్‌ను అమలు చేయాలని, అలాగే కుంబీలను మరాఠాలుగా గుర్తించేందుకు చట్టాన్ని తీసుకురావాలని ఉద్యమకారుడు మనోజ్ జరాంగే డిమాండ్ చేస్తున్నారు. కుంబీ అనే అగ్ర కుల సమూహం ఓబీసీ విభాగం కిందకు వస్తుంది. మరాఠాలందరికీ కుంబీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో కోటాకు వారిని అర్హులుగా చేయాలని జరంగే డిమాండ్ చేస్తున్నారు. మరాఠా రిజర్వేషన్ డిమాండ్ మధ్య, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం ఉన్న కోటాను భంగం చేయబోమని ప్రభుత్వం నుంచి హామీ ఇవ్వాలని కోరుతూ గత వారం నుంచి ఇద్దరు ఓబీసీ కార్యకర్తలు జాల్నా జిల్లాలో నిరాహార దీక్షకు కూర్చున్నారు. పవార్ మాట్లాడుతూ 'రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాల్లో మార్పు రావాలి' అని అన్నారు. 'ప్రభుత్వాలు, ప్రత్యేకించి కేంద్రం రెండు వర్గాల డిమాండ్లను పరిష్కరించడంలో నాయకత్వం వహించాలి. ఆందోళనలు ఒక పరిమితిని దాటకుండా చూసుకోవాలి. సామాజిక ఉద్రిక్తతలు జరగకుండా చూసుకోవాలి. ప్రభుత్వాలు ఈ సమస్యపై కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదు' అని అన్నారు. రెండు వర్గాల (ఓబీసీ, మరాఠా) లేవనెత్తిన సమస్యలపై కేంద్రం దృష్టి సారించాలని, పరిష్కారానికి ప్రయత్నించాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పార్లమెంటులో మేము ఈ సమస్యపై పట్టుబడతాం. ఇతర ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడి ఈ సమస్యపై సమష్టిగా నిలబడటానికి ప్రయత్నిస్తాం' అని చెప్పారు. ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటే ప్రతిపక్షాలు రాజకీయాలను ఈ అంశంలోకి తీసుకురాబోవని పవార్ అన్నారు. 'సామాజిక ఉద్రిక్తతను తగ్గించడానికి సహకరిస్తాం. కానీ వారు (ప్రభుత్వం) ఏమీ చేయకపోతే, మేము అన్ని పార్టీలను ఏకం చేసి భవిష్యత్ కార్యాచరణపై సమష్టిగా నిర్ణయం తీసుకుంటాం' అని ఆయన చెప్పారు. గత వారం నుంచి బారామతి లోక్‌సభ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలను సందర్శించిన పవార్, రైతులకు సంబంధించిన సమస్యలపై, ప్రజలు లేవనెత్తిన సమస్యలపై చర్చించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు లేఖ రాశానని చెప్పారు. 'ఈ సమస్యలపై ముంబైలో సమావేశం కావాలని ఆయన (సీఎం) ను అభ్యర్థించాను. ఆయనతో ఫోన్‌లో కూడా మాట్లాడతాను. రైతులు, నీటి ఎద్దడి, పాల ధరలు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని సమస్యలను అందజేస్తాను. ఈ ప్రాంతాన్ని సందర్శిస్తాను' అని సందర్శిస్తానని తెలిపారు. కాగా, పవార్ కుమార్తె సుప్రియా సూలే ఇటీవలే బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఎన్నికయ్యారు.

త్వరలోనే యూజీసీ నెట్ పరీక్ష

కేంద్ర విద్యాశాఖ

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగిన యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షలో అక్రమాలు జరిగినట్లు నివేదిక అందడంతో కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేసింది. దీనిపై తాజాగా కేంద్ర విద్యాశాఖ అధికారులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సుమోటోగా చర్యలు చేపట్టినట్లు విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ గురువారం వెల్లడించారు. త్వరలోనే కొత్త పరీక్ష తేదీ ప్రకటిస్తామని తెలిపారు. 'నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, విశ్వసనీయత దెబ్బతిందని ఏజెన్సీలు ఇచ్చిన నివేదికతో మాకు అర్థమైంది. అందుకే పరీక్ష రద్దు చేశాం. ప్రస్తుతం దీనిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించినందున ఇంతకంటే వివరాలను మేం వెల్లడించలేం. త్వరలోనే మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం. బాధ్యులు ఎవరైనా సరే...కఠిన చర్యలు తీసుకుంటాం' అని జైశ్వాల్ వెల్లడించారు.

జూన్ 18వ తేదీన దేశంలోని అనేక నగరాల్లో ఓఎమ్మార్ (పెన్ను, పేపరు) విధానంలో యూజీసీ నెట్ పరీక్ష జరిగింది. దీనిని ఎన్‌టీఏ రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. అయితే ఇందులో అక్రమాలు జరిగాయని కేంద్ర హోంశాఖ అధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి(ఐసీసీసీ) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం బుధవారం యూజీసీకి నివేదిక ఇచ్చింది. దీంతో పరీక్ష రద్దు చేశారు. ఓవైపు నీట్ యూజీ పరీక్షలో అక్రమాలపై వివాదం కొనసాగుతున్న వేళ యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం తీవ్ర దుమారం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు కేంద్రంపై ధ్వజమెత్తాయి. లీక్‌లు, మోసాలు లేకుండా మోదీ సర్కారు పరీక్షలు నిర్వహించలేకపోతోందని ఎద్దేవా చేశాయి. 'పరీక్షా పే చర్చా' అంటూ హంగామా చేసే ప్రధాని... ఈ లీక్‌లపై మాట్లాడుతారా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

భారీగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు

గతేడాది రూ.1.56 లక్షల కోట్ల ఆస్తుల విక్రయం

ఈ ఏడాది మరో రూ.2 లక్షల కోట్లు లక్ష్యం

న్యూఢిల్లీ: బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ ఆస్తుల అమ్మకమే పనిగా పెట్టుకుంది. విపక్షాలు, కార్మికసంఘాలు ఎంత ఒత్తిడి చేసినా ఓవైపు ప్రభుత్వరంగ సంస్థలు కారుచౌకగా తమ అనుయాయులకు కట్టబెడుతూ...మరోవైపు ప్రభుత్వ ఆస్తులను తెగనమ్ముతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్ఎంపీ) కింద మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అది సాధ్యం కాలేదు. అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులు అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులు సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. అందులో భాగంగా 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులు అమ్మేసింది. 2023-24తో కలిపితే మూడేళ్లలో మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆస్తులు విక్రయించింది. తొలి రెండేళ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా ఆస్తుల అమ్మకం చేసింది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులు అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్‌పరం కాబోతున్నాయి. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ 33 ఆస్తులను గుర్తించింది. రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సర్కారు సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలు తగ్గించుకున్న కేంద్రం... ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించింది. ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేళ్ల కాలంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలు అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం సర్వత్రా విమర్శలకు గురవుతోంది.

అగ్నిగుండంలా ఢిల్లీ

తొమ్మిది రోజుల్లో 192 మంది నిరాశ్రయుల మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ నిప్పుల కొలిమిలా మారింది. ఒకవైపు నీటి సంక్షోభం, మరోవైపు అత్యధిక ఉష్ణోగ్రతలతో ఢిల్లీవాసులు తల్లడిల్లుతున్నారు. ఢిల్లీలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆ రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. కనీసం రాత్రిపూట కూడా వాతావరణం చల్లబడడం లేదు. గత పధ్నాలుగేళ్లలో ఎన్నడూ లేనంతగా రాత్రివేళ కూడా రాజధానిలో 35.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. నిరాశ్రయుల అవస్థలు మరింత దారుణంగా మారింది. ఉండడానికి నీడ లేక ఫుట్‌పాత్‌లపైనే కాలం వెళ్లదీసేవాళ్లు ఎండవేడిమికి తట్టుకోలేక వందలాది మంది మృతి చెందుతున్నారు. ఈ నెల జూన్ 11 నుంచి 19వ తేదీ వరకూ తొమ్మిది రోజుల వ్యవధిలో 192 మంది నిరాశ్రయులు చనిపోయారని సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ అనే ఎన్జీవో సంస్థ పేర్కొంది. గత ఐదేళ్లలో నమోదైన అత్యధిక మరణాలు ఇవే అని ఎన్జీవో స్పష్టం చేసింది. ఎన్‌జీవో ఎగ్జికూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అలెడియా మాట్లాడుతూ 'జూన్ 11 నుంచి 19వ తేదీ వరకూ కేవలం తొమ్మిది రోజుల్లో తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బకు గురై ఢిల్లీలో 192 మంది నిరాశ్రయులు మృతి చెందారు' అని చెప్పారు. కాగా గత ఐదేళ్లలో జూన్ 11 నుంచి 19 వరకూ ఢిల్లీలో ఎంతమంది నిరాశ్రయులు చనిపోయారో ఎన్‌జీవో వివరించింది. 2019లో జూన్ 11 నుంచి 19 వరకూ 143 మంది చనిపోయారు. 2020లో 124 మంది, 2021లో 58 మంది, 2022లో 150 మంది, 2023లో 75 మంది, ఈ ఏడాది ఏకంగా 192 మంది నిరాశ్రయులు ప్రాణాలు కోల్పోయారు.

కేజ్రీవాల్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.లక్ష పూచీకత్తుపై బెయిల్ ఇస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి నియా బిందూ తెలిపారు. బెయిల్ ఉత్తర్వులపై స్టే లేదని స్పష్టంచేశారు. బెయిల్ బాండు కోసం శుక్రవారం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తొలుత తీర్పును రిజర్వులో పెట్టి తర్వాత వెలువరించారు. కాగా, కేజ్రీవాల్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆప్ అధినేతపై ఆరోపణలను రుజువు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వద్ద ఆధారాలు లేవని, అప్రూవర్లు చెప్పిన ఆధారంగా కేజ్రీవాల్‌పై అభియోగాలు మోపుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సౌత్ గ్రూపు నుంచి రూ.100 కోట్లు వచ్చినట్లు ఆధారాలు లేవు. అప్రూవర్లు చెప్పిన ఆధారంగా కేసు నడవదు. ఆయనపై ఆరోపణలకు ఎలాంటి రుజువుల్లేవు' అని న్యాయవాది వాదించారు. తీర్పును పై కోర్టులో సవాల్ చేసేందుకు వీలుగా బెయిల్ బాండ్లు అంగీకరించేందుకు 48 గంటల సమయం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోరగా... బెయిల్ ఆర్డర్‌పై స్టే లేదని న్యాయమూర్తి స్పష్టతనిచ్చారు. రెండు రోజుల విచారణ తర్వాత కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చారు.

ఈపీఎఫ్‌ఓ ఏప్రిల్ చేరికలు... 18.92 లక్షలు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఏప్రిల్ నెల సభ్యత్వం 18.92 లక్షలుగా ఉన్నట్లు గురువారం విడుదలైన పేరోల్ డేటా పేర్కొంది. 2018 ఏప్రిల్‌లో తొలి పేరోల్ డేటా ముద్రించగా, అప్పటి నుంచి ఇప్పటివరకు ఏప్రిల్‌లో ఇంత మంది చేరిన దాఖలాలు లేవని కార్మికశాఖ ప్రకటన తెలిపింది. 2024 మార్చితో పోల్చితే ఏప్రిల్ సభ్యత్వం 31.29శాతం పెరిగిందని పేర్కొంది. ఏప్రిల్‌లో 18.92లక్షల మంది ఈపీఎఫ్‌ఓలో చేరినట్లు డేటా వెల్లడించింది. ఏటేట నమో దయ్యే చేరికలను గమనిస్తే వృద్ధి 10శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగావకాశాలు పెరగ డం, ఉద్యోగుల ప్రయోజనాలపై అవగాహన పెరగడం, ఈపీఎఫ్‌ఓ పథకాల సమర్థ అమలు వంటి కారణాలతో చేరికలు పెరిగినట్లు పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 8.87 లక్షల కొత్త సభ్యులు చేరారని డేటా సూచించింది. వీరిలో 18-25 ఏళ్ల వారు 55.50శాతంగా ఉన్నట్లు తెలిపింది. 14.53 మంది సభ్యులు తొలుత నిష్క్రమించి, తిరిగి ఈపీఎఫ్‌ఓ సభ్యులై నట్లు డేటా పేర్కొంది. కొత్త సభ్యుల్లో 2.49లక్షల మంది మహిళలు ఉన్నారని, మొత్తంగా 3.91లక్షల మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపింది. మార్చితో పోల్చితే మహిళా సభ్యులు 35.06శాతం మేర పెరిగినట్లు వెల్లడించింది. రాష్ట్రాల వారీగా చూసినట్లయితే మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, హర్యానాలో చేరిన సభ్యులు 58.30శాతంగా ఉన్నట్లు డేటా వెల్లడించింది.

ఎంఎస్‌పీ... కంటితుడుపు

- మోదీ హయాంలో అన్నదాతకు తీరని అన్యాయం
- విరివిగా దిగుమతులు: దేశీయ రైతుకు నష్టాలు
- ప్రభుత్వ విధానాలకు నిరసనగా 24 నుంచి పోరాట వారోత్సవం
- ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య

న్యూఢిల్లీ: ఖరీఫ్ పంటలకు సగటున 6.8శాతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను కేంద్రం ప్రకటించడం కంటితుడుపు చర్య అని ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య వ్యాఖ్యానించారు. మోదీ హయాంలో అన్నదాతకు తీరని అన్యాయం జరిగిందని, పూర్తిస్థాయి మెజారిటీ దక్కకుండా చేసినప్పటికీ బీజేపీకి బుద్ధి రాలేదని విమర్శించారు. వ్యవసాయోత్పత్తుల దిగుమతులను పెంచడం ద్వారా దేశీయ రైతులను ఉరికంబమెక్కిస్తున్నదని దుయ్యబట్టారు. రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు సంఘర్ష్ సప్తా (పోరాట వారత్సోవం) చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో, ప్రతి జిల్లా, తాలూకాలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐకేఎస్‌తో పాటు కలిసి వచ్చే రైతుల సంఘాలు, సమాఖ్యలను కలుపుకొని ముందుకెళతామని తెలిపారు. దేశ రైతుల కంటే అమెరికా, ఆస్ట్రేలియా రైతులకు ప్రయోజనం చూకూర్చేలా మోదీ ప్రభుత్వ వ్యవసాయ విధానాలు ఉన్నట్లు రావుల వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2020-21 నుంచి 2023-24 వరకు విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విలువ సంవత్సరానికి రూ.3లక్షలకోట్లకు చేరుకున్నట్లు వెల్లడించారు. వ్యవసాయోత్పత్తులను చౌకగా దిగుమతి చేసుకుంటుండటం వల్ల మన రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎరువులు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీల ఉపసంహరణ, జీఎస్టీ విధింపుతో సాగు వ్యయం రెట్టింపు అయిందని, ఆదాయం పడిపోయిందని, కరువు సాయం, పంట బీమా లేకపోవడానికి తోడు రైతు వ్యతిరేక విధానాల అమలుతో ప్రకృతి వైపరీత్యాలప్పుడు రుణ ఉచ్చులో అన్నదాత చిక్కుకుంటున్నాడని రావుల వెంకయ్య తెలిపారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు జరుగుతున్నాయని విమర్శించారు. దేశ రైతులకు ప్రయోజనం చేకూరే సమయానికి ఎగుమతులను ప్రభుత్వం నిషేధించిందని, మోదీ హయాంలో మహారాష్ట్రలోని ఉల్లి సాగుదారులు తీవ్రంగా నష్టపోయారని రావుల వెంకయ్య పేర్కొన్నారు. పత్తి రైతులకు ఎంఎస్‌పీని నామమాత్రంగా పెంచడంతో సాగుదారులు ఆత్మహత్యలనే శరణ్యంగా భావించారని ఆందోళన వ్యక్తంచేశారు. 2022-23లో పత్తి దిగుమతులు డ్యూటీ ఫ్రీ కావడమే కాకుండా 200శాతం మేర పెరిగాయని తెలిపారు. రూ.15వేల కోట్లు విలువ చేసే పత్తి బేళ్లు దిగుమతి చేసుకున్న కారణంగా దేశీయ పత్తి సాగుదారునికి ఆత్మహత్య తప్ప మరో మార్గంలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆస్ట్రేలియాతో ఒప్పందం కారణంగా 2027 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. సోయాబీన్స్ విషయంలోనూ ఇలానే జరుగుతోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తులకు గ్యారెంటీ ధరల హక్కు కల్పించే ఎంఎస్‌పీ చట్టం తెస్తామని 383 రోజులు సాగిన రైతాంగ ఉద్యమప్పుడు హామీనిచ్చిన మోదీ ప్రభుత్వం ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పత్తి, సోయా బీన్స్ దిగుమతులపై పన్నులు ఎత్తివేసిందని, రైతుల కోసం అమలు చేసే విధానాల్లో పారదర్శకత లేదన్నారు. మాండసార్‌లో రైతుల ఆందోళనపై కాల్పులు, ఆరుగురు అన్నదాతల మరణానికి కారణమైన శివరాజ్ చౌహాన్‌కు కేంద్ర వ్యవసాయ శాఖను కట్టబెట్టడం ద్వారా రైతులపై ఓ విధంగా యుద్ధాన్నే మోదీ ప్రభుత్వం చేస్తోందని రావుల వెంకయ్య వ్యాఖ్యానించారు. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా పోరాట వారోత్సవం జరుగుతుందని రావుల వెంకయ్య పేర్కొన్నారు.

పంట కాలంలో కరవు బృందం పర్యటనలా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆక్షేపణ

విశాలాంధ్ర-విజయవాడ: పంట పెట్టే కాలంలో, వర్షాలు కురిసే సమయంలో కరవు తీవ్రతపై కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల పట్ల శీతకన్ను వేసిందని విమర్శించారు. గత సీజన్‌లో దాదాపు 87 మండలాలలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర ప్రభుత్వం నివేదించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించిందని తెలిపారు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు కేంద్ర బృందం ఇప్పుడు వచ్చి ప్రకటనలు చేస్తున్నదని మండిపడ్డారు. వర్షాలు కురవడంతో అనంతపురం జిల్లాలో రైతులు ఇప్పటికే పొలాలను సాగుకు సిద్ధం చేశారని, కర్నూలు జిల్లాలో పంట కూడా పెట్టారని తెలిపారు. కొత్తగా పంట పెట్టిన తరువాత వర్షాలు కురుస్తున్న వేళ కేంద్ర బృందం నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో పర్యటనలు చేస్తున్నదంటే...వీరికి వ్యవసాయం పట్ల, రైతుల ప్రయోజనాల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదని అర్థమవుతోందని ధ్వజమెత్తారు. ఈ బృందానికి వ్యవసాయం మీద కనీస పరిజ్ఞానం ఉందా? కరువు వచ్చింది ఎప్పుడు? పంట నష్టం జరిగింది ఎప్పుడు? ఇప్పుడు కేంద్ర బృందం వచ్చి పంటనష్టాన్ని ఎలా అంచనా వేస్తుందని ప్రశ్నించారు. కరవు వచ్చినప్పుడు కేంద్ర బృందం పర్యటిస్తే రైతుల బాధలు, కరువు తీవ్రత అర్థమవుతుందన్నారు. ఒక పర్యాయం పంట పూర్తయి, మళ్లీ జూన్ నెల సమీపించి పంట పెట్టుకునే సందర్భంలో కేంద్ర బృందం పర్యటనలు చేయటంపై విచారం వ్యక్తం చేశారు. అధికారులు చెప్పిందే కేంద్ర బృందం వినాలేతప్ప స్వయంగా అంచనా వేసే పరిస్థితి లేదని, ఒకవేళ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తే... ఆ ఫొటోలు తిలకించడం తప్ప చేసేదేం లేదన్నారు. రైతుల పట్ల, వ్యవసాయం పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, రైతులకు సక్రమంగా సాయం అందించడం లేదన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా రైతులు పంటలు పెట్టుకోవడానికి బ్యాంకుల నుండి రుణాల రూపంలో సహాయం అందించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి రైతును ఆదుకోవడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పంట పెట్టే కాలంలో విత్తనాలు, ఎరువులు కొనాల్సిన పరిస్థితి నెలకొన్న దృష్ట్యా చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి రైతుకు రూ.20 వేలు తక్షణమే ఇచ్చి ఆదుకోవాలని రామకృష్ణ కోరారు.

8-10 తేదీల్లో శిక్షణా తరగతులు

జయప్రదానికి జాన్సన్ బాబు పిలుపు

శ్రీకాకుళం: విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు జులై 8, 9, 10 తేదీల్లో కాకినాడలో జరగబోతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. మొత్తం 300 మంది విద్యార్థులతో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను గురువారం శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్ పోరాటాల వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని జాన్సన్ బాబు వెల్లడించారు. నూతన జాతీయ విధానం పేరుతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష అవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. 2,635 పాఠశాలలు మూతబడ్డాయని గుర్తుచేశారు. కేజీబీ గురుకుల మోడల్ పాఠశాలల బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో సీట్లు పెంచాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ కాలేదని, విశ్వవిద్యాలయాల పనితీరులో రాజకీయ జోక్యం ఎక్కువైందని అన్నారు. దేశ జీడీపీలో నుంచి విద్యా రంగానికి ఆరు శాతం మేర ఖర్చు చేయాల్సి ఉండగా కేంద్రం కనీసం ఒక్క శాతమైనా ఖర్చు చేయడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వ భావజాలాన్ని విద్యార్థులకు నూరిపోసే విధంగా విద్యా విధానం ఉన్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్, వారి సంక్షేమం కోసం తగు చర్యలను చేపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. డబ్బుకు కక్కుర్తి పడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న నీట్ పేపర్ లీకేజి దోషులను కఠినంగా శిక్షించాలని జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం తాము చేపట్టబోయే భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని ఆయనన్నారు.

అసెంబ్లీ ప్రోటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి

- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్
- మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ప్రోటెం స్పీకర్‌గా, సీనియర్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరితో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం రాజ్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఆయన ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బుచ్చయ్య చౌదరి... ప్రోటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేయడంపై మంత్రులు, శాసనసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 21, 22 తేదీల్లో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రోటెం స్పీకర్‌గా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. ప్రోటెం స్పీకర్‌గా తనతో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్ చేత ప్రోటెం స్పీకర్‌గా ఎంపికైన గోరంట్ల బుచ్చయ్య చౌదరి నియామక పత్రాన్ని ముందుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు చదివి వినిపించారు. ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ధూళిపాళ్ల నరేంద్ర చౌదరి, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, సవిత, ఎం.రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, పి.అదితి గజపతి రాజు, బోండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాసులు, సుందరపు విజయ్ కుమార్, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం బుచ్చయ్య చౌదరికి వారు అభినందనలు తెలిపారు.

ఏపీ పోలీస్ బాస్ ద్వారకా తిరుమలరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా ద్వారకా తిరుమలరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీజేశారు. సీనియార్టీ క్రమంలో ద్వారకా తిరుమలరావుకు అవకాశం దక్కింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో హరీశ్‌కుమార్ గుప్తాను డీజీపీగా నియమించారు. మే 6వ తేదీన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా బాధ్యతలు చేపట్టి... దాదాపు నెలన్నరపాటు విధులు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో వరుస వారీగా అధికారులను మార్చడంపై దృష్టి పెట్టారు. నూతన డీజీపీగా నియమితులైన ద్వారకా తిరుమలరావు 2021 జూన్ నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీగా పని చేస్తున్నారు. ఈయన 1989 బ్యాచ్ ఐపీఎస్ కేడర్‌కు చెందిన వారు. ప్రస్తుతం రాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారుల సీనియార్టీ జాబితాలో అగ్రస్థానంలో ఉండటంతో ప్రాధాన్యత క్రమంలో డీజీపీ పదవి వరించింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తొలుత కర్నూలు ఏఎస్పీగా ఈయన మొట్టమొదటి బాధ్యతలు నిర్వహించి, ఆ తర్వాత కామారెడ్డి, ధర్మవరంలోను ఏఎస్పీగా పని చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా ఆపరేషన్స్ విభాగం అదనపు ఎస్పీగాను, విజయవాడ రైల్వే, సీఐడీ, సీబీఐ విభాగాల్లో ఎస్పీగా పని చేశారు. అనంతపురం, హైదరాబాద్, రేంజ్‌లతో పాటు ఎస్ఐబీలో డీఐజీగా తదితర బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. నూతనంగా నియమితులైన డీజీపీకి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

రాయ్‌కు మద్దతుగా ఢిల్లీలో లెఫ్ట్ ధర్నా

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై ఉపా చట్టం కింద చర్యలకు ఆదేశాలను ఖండిస్తూ లెఫ్ట్ సంఘాలు గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయి. రాయ్, హుస్సేన్‌పై ఉపా చర్యల రద్దునకు డిమాండ్ చేశాయి. బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించాయి. సీపీఐ-ఎంఎల్ సభ్యులు, అనుబంధ సంఘాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో జంతర్ మంతర్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు.

సచివాలయం కోలాహలం

ఒకేరోజు 8 మంది మంత్రులు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మంత్రులు గురువారం ఒకేరోజు 8 మంది బాధ్యతలు స్వీకరించడంతో సచివాలయం కోలాహలంగా మారింది. మంత్రులు, శాసన సభ్యులు, వారి అనుచరులతో కళకళలాడింది. వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఈడబ్ల్యూఎస్, చేనేత జౌళి శాఖల మంత్రిగా సంజీవరెడ్డిగారి సవిత సచివాలయం నాల్గవ బ్లాక్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత డీఎస్సీ కోచింగ్, ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కొనసాగింపు పథకాలపై తొలి, మలి సంతకాలు చేశారు. అలాగే రెవెన్యూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నాల్గవ బిల్డింగ్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై సంబంధాల శాఖ మంత్రిగా కొండపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాఖాపరమైన ఫైల్స్‌పై సంతకాలు చేశారు. రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రిగా టీజీ భరత్ బాధ్యతలు స్వీకరించి గుజరాత్ తరహాలో రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో గత ప్రభుత్వం చేసిన అవినీతిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామానాయుడు అన్నారు. కాలువలు, డ్రెయిన్లలో తూడు తొలగింపు, డీసిల్టింగ్ పనులకు తొలి సంతకం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ గత ప్రభుత్వ హయాంలో అమలైన వైఎస్సార్ బీమా పథకం పేరును చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చే ఫైల్‌పై సంతకం చేశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఆనం రాంనారాయణ రెడ్డి గొల్లపూడిలో దేవాదాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించి దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతానని తెలిపారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.